ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

సంగారెడ్డి

20

బుధవారం 30 ఆగస్టు 2017





రాయికోడ్‌లోని ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహిస్తున్న రైతులు

రుణాల కోసం రైతుల రాస్తారోకో

- కాలయాపన చేస్తున్నారంటూ ఆగ్రహం
- వారంలోగా రుణాలు మంజూరు
- బ్యాంకు సిబ్బంది హామీ

5

గొర్రె.. దాటలేదు!

మందకొడిగా సాగుతున్న గొర్రెల పంపిణీ

- జిల్లా యంత్రాంగం నిర్దేశించిన లక్ష్యం 15,551 యూనిట్లు
- ఇప్పటివరకు అందజేసింది 3,898 యూనిట్లే
- రీసైక్లింగ్ చేస్తున్నట్టు ఆరోపణలు
- జిల్లా సరిహద్దుల్లో పటిష్ఠ నిఘా
- కలెక్టర్ ఆదేశాల మేరకు చెక్‌పోస్టుల ఏర్పాటు

గొల్ల, కుర్మ, యాదవుల ఆర్థిక స్వావలంబనకు ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన గొర్రెల పంపిణీ జిల్లాలో మందకొడిగా సాగుతున్నది. లక్ష్యం చేరుకోవడంలో పశు సంవర్ధక శాఖ తడబడుతున్నది. 2017-18 సంవత్సరానికి 15,551 యూనిట్ల పంపిణీ లక్ష్యంగా జిల్లా యంత్రాంగం నిర్ణయించింది. ఇప్పటివరకు కేవలం 3,898 యూనిట్లనే లబ్ధిదారులకు అందజేసింది. దీంతో సీఎం కేసీఆర్ ఆశించిన లక్ష్యం నెరవేరడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

5





గొర్రెలను మేపుతున్న కాపరులు



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గీతారెడ్డి

డీడీఎస్ కృషి అమోఘం

- సంస్థ ఆధ్వర్యంలో మహిళా సాధికారత
- చిరుధాన్యాలపై అవగాహన కల్పించడం సంతోషకరం
- జహీరాబాద్ ఎమ్మెల్యే గీతారెడ్డి

4 లో

పత్తి వైపే మొగ్గు

వర్షాలు తక్కువగా ఉంటాయని, వాణిజ్య పంటలు వద్దంటూ గతేడాది ప్రభుత్వం విస్తృతంగా ప్రచారం నిర్వహించింది. అధిక శాతం రైతులు పెసర, మినుము, కంది తదితర పంటలను సాగు చేశారు. తీరా చేతికందే దశలో ధరలు పడిపోయాయి. కొనేవారు లేక రైతులు దిక్కులు చూశారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినప్పటికీ వాటిలో విక్రయించడానికి పడిగాపులు కాయాల్సివచ్చింది. దీనికి తోడు సకాలంలో డబ్బు ఇవ్వక రైతులను అధికారులు ఇబ్బందులకు గురి చేశారు. ఈ నేపథ్యంలో ఈసారి అధిక శాతం రైతులు పత్తిపంట వైపు మొగ్గుచూపారు. నారాయణఖేడ్ డివిజన్‌లో సాగు గణనీయంగా పెరిగింది.



నారాయణఖేడ్‌లో పత్తి పంట

- నారాయణఖేడ్‌లో గణనీయంగా పెరిగిన సాగు
- పంట సాధారణ విస్తీర్ణం 1,88,110 హెక్టార్లు
- ఈసారి 1,98,477 హెక్టార్లలో...
- తగ్గిన పప్పు దినుసుల సాగు
- గతేడాది పడిపోయిన కంది ధర
- తెల్లబంగారానికి ఎప్పుడూ డిమాండ్
- విక్రయిస్తే వెంటనే డబ్బు
- ఇదే రైతుల ఆసక్తికి కారణం

5

ఉచితంగా చేప పిల్లల పంపిణీ

4 లో

- 3.60 కోట్ల చేపపిల్లలను వదిలేందుకు ప్రభుత్వ ప్రణాళిక
- సింగూరు నుంచి నేడే శ్రీకారం
- హాజరుకానున్న మంత్రి 'తలసాని'

ఇంటర్వ్యూ



ఫిట్‌నెస్ లేని వాహనాలపై చర్యలు

- జిల్లాలో మూడు యూనిట్ ఆఫీసులు ఏర్పాటు
- రామేశ్వర్‌రెడ్డి, సిద్దిపేట డీటీవో

సిద్దిపేట క్రైం : ఫిట్‌నెస్ లేని వాహనాలపై చర్యలు తీసుకుంటామని సిద్దిపేట డీటీవో రామేశ్వర్‌రెడ్డి తెలిపారు. ప్రజలకు ఇబ్బంది కలగకుండా సిద్దిపేట జిల్లాలోని గజ్వేల్, హుస్నాబాద్, చేర్యాలలో యూనిట్ ఆఫీసులను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. పలు విషయాలపై ఆయన ఆంధ్రజ్యోతితో ప్రత్యేకంగా మాట్లాడారు.

జిల్లాలో ఎన్ని ఫిట్‌నెస్ వాహనాలు ఉన్నాయి ?

జిల్లాలో అన్ని కేటగిరిల వాహనాలు కలిపి మొత్తం 104308 వాహనాలకు ఫిట్‌నెస్ పూర్తి చేశాం.

ఫిట్‌నెస్ లేని వాహనాల విషయంలో మీరు తీసుకునే చర్యలు ఏమిటి ?

ఫిట్‌నెస్ లేని వాహనాలు రోడ్డుపై తిరిగితే పట్టుకొని సీజ్ చేస్తాం. వాహనాన్ని బట్టి రూ. 2 వేల నుంచి రూ. 5 వేల దాకా జరిమానా విధిస్తాం.

వాహనదారులకు మీరిచ్చే సూచనలేమిటి ?

వాహనదారులు కచ్చితంగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలి. వాహనం రిజిస్ట్రేషన్, ఇన్సూరెన్స్ పేపర్‌లను కలిగి ఉండాలి. మద్యం సేవించి, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనం నడపరాదు.

వాహనాల షోరూంలకు మీరిచ్చే అనుమతులు ఏమిటి ?

వాహనాల షోరూం ఏర్పాటుకు అనుమతిని మేమే ఇస్తాం. అలాగే వారు వాహనం టీఆర్ నంబర్‌ను క్రియేట్ చేసుకోవడానికి అనుమతిని ఇస్తాం.



కొత్తిమీర కోస్తున్న కూస లలిత, రాజు

లాభాలు బాగు

మార్కెట్లో దేనికి డిమాండ్ ఉన్నదో దాన్ని ఉత్పత్తి చేస్తే ఆదాయం పొందొచ్చు. ఈ సూత్రం వ్యాపారులకే కాదు.. రైతులకూ వర్తిస్తుంది. రసాయన మందులు వినియోగించి సాగు చేసిన వాటికంటే.. సేంద్రియ విధానంలో పండించిన వాటికి ఇప్పుడు మంచి డిమాండ్ ఉంది. దీన్ని గుర్తించిన కొందరు కర్షకులు సేంద్రియ బాట పడుతున్నారు. రసాయన సేద్యం నుంచి ఆ దిశగా వెళ్లే క్రమంలో కొన్ని ఇబ్బందులు ఎదురైనా ఓర్పు, నేర్పుతో వాటిని అధిగమించి మంచి లాభాలు అందుకుంటున్నారు. అంతే కాదు వినియోగదారులకు మంచి ఆకుకూరలు, కూరగాయలు అందజేస్తూ పేరు తెచ్చుకుంటున్నారు. ఇలాంటి సాగు పద్ధతుల ద్వారానే లాభాలు ఆర్జిస్తున్న రైతు దంపతులపై కథనం.

- కూరగాయలు, ఆకుకూరలు పండిస్తూ మంచి ఆదాయం పొందుతున్న దంపతులు
- రసాయన మందులు వినియోగించకుండా సాగు
- ప్రభుత్వ సాయం కోసం ఎదురు చూపు

మద్దూరు: ప్రస్తుతం చాలామంది విష కలుషితాలు లేని స్వచ్ఛమైన ఆహారోత్పత్తులనే వినియోగిస్తున్నారు. దీంతో రసాయన ఎరువులు, పురుగు మందులు వాడని ఆకు కూరలు, కూరగాయలకు మార్కెట్లో మంచి డిమాండ్ ఏర్పడింది. రసాయన వినియోగించి పండించిన కూరగాయలు ఆరోగ్యాన్ని కొద్దిగైనా పాడు చేస్తాయి. అలాగే వీటిని పండించే రైతులు కూడా చాలా ఆర్థికభారం భరించాల్సి వస్తోంది. రసాయన ఎరువులు, క్రిమి సంహారక మందులకు భారీగా ఖర్చు చేయాల్సి వస్తోంది. దీంతో దిగుబడులపై లాభాలు అంతగా రావడం లేదు. ఈ నేపథ్యంలో కొందరు రైతులు సేంద్రియ సాగుపై దృష్టి సారించి అందులో అధిక రాబడి సాధిస్తున్నారు. ఇదే బాటలో పయనిస్తూ మంచి ఆదాయాన్ని అర్జిస్తున్నారు మండలంలోని మర్మాముల గ్రామానికి చెందిన దంపతులు కూస లలిత, రాజు.

వీరికి 3. 30 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. అలాగే మరో రెండెకరాలను కౌలుకు తీసుకున్నారు. రెండెకరాల్లో వరి, ఎకరన్నరలో తోటకూర, కలెగూర, పాలకూర, గోంగూర, చుక్కకూర, గంగవాయిలికూరలతో పాటు గోరుచిక్కుడు, కొత్తిమీర, మెంతికూర సాగు చేస్తున్నారు. కౌలుకు తీసుకున్న రెండెకరాల్లో పత్తి వేశారు. ఇక కూరగాయల దిగుబడులను చుట్టు పక్కల గ్రామాల్లో సాగే సంతల్లో విక్రయిస్తున్నారు. వీరే సొంతంగా కూరగాయలను అమ్ముకోవడం వల్ల మంచి లాభాలు పొందుతున్నారు. వారంలో చిన్న సంతల్లో రూ. 2 వేలు, పెద్ద సంతలో రూ. 2 వేల దాకా ఆదాయం వీరికి లభిస్తోంది. ఆ డబ్బును ఇతర పంటల సాగుకు వినియోగిస్తున్నారు. ఇక సాగు మొత్తం సేంద్రియ విధానంలో చేపట్టడం వల్ల పెద్దగా ఖర్చులు కూడా లేవు. మంచి రాబడులు వస్తున్నాయి.



ఎనిమిదేళ్లుగా పండిస్తున్నా

ఎనిమిదేళ్లుగా సేంద్రియ విధానంతో ఆకుకూరలు, కూరగాయలు పండిస్తున్నా. ఒక్కోసారి వర్షాలతో ఆకుకూరలు దెబ్బతింటుండటంతో నష్టపోవాల్సి వస్తుంది. మా పొలంలోని బావిలో సరిపడ నీరు ఉండటంతో సాగునీటికి ఇబ్బందులు ఎదురుకాలేదు. సంతల్లో మారు వ్యాపారం నిర్వహించే వారికి కూరగాయలు ఇవ్వకుండా సొంతంగా విక్రయిస్తుండటంతో తెలిసిన వారే ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారు. మంచి ఆదాయం వస్తుంది. ప్రభుత్వం చిన్నసన్నకారు రైతులకు పలు పథకాలు అందిస్తున్నట్లు చెబుతున్నా మాలాంటి రైతులకు మాత్రం అందడంలేదు.

- కూస రాజు, రైతు, మర్మాముల

ప్రభుత్వ పథకాలు రైతుల దరిచేరేలా చూడాలి

ప్రభుత్వ పథకాలు చిన్నసన్నకారు రైతుల దరిచేరేలా చూడాలి. ఉపాధిహామీ పథకంలో కల్లాల ఏర్పాటుతో పాటు కూరగాయల సాగులో పందిరిసాగుకు సబ్సిడీ అందివ్వాలి. కూరగాయల విత్తనాలు ప్రభుత్వమే వ్యవసాయశాఖ ద్వారా అందించాలి. డ్రిప్ సౌకర్యం కల్పించాలి. రైతులు పండించిన ఆకుకూరలు, కూరగాయలు దగ్గర్లోనే విక్రయించుకునేలా అందుబాటులో మార్కెట్ సౌకర్యం కల్పించాలి.

- కూస లలిత, రైతు, మర్మాముల



ఉద్యోగులకు వెంటనే బదిలీలు చేపట్టాలి

ఉద్యోగపర్వం

- మల్లేశం, టీఎన్జీవోస్ దుబ్బాక తాలూకా అధ్యక్షుడు



తెలంగాణలోని కొత్త జిల్లాల్లో వర్క్ టూ రూల్ కింద పని చేస్తున్న ఉద్యోగులకు వెంటనే బదిలీలు చేపట్టాలి. ప్రస్తుతం వారికి కేటాయించిన స్థానాలల్లో పనులు సక్రమంగా నిర్వర్తించలేకపోతున్నారు. ఉద్యోగ విభజన లేకపోవడం మూలంగా ఉద్యోగ బదీలులు కూడా చేపట్టలేని పరిస్థితి నెలకొంది. అన్ని ప్రభుత్వ కార్యాలయాలల్లో ఖాళీలు ఏర్పడడంతో ఉద్యోగులకు పని ఒత్తిడి పెరిగింది. సంక్షేమ కార్యక్రమాలు కూడా పూర్తి స్థాయిగా అమలు కాని పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం వెంటనే స్పందించి పరస్పర బదిలీలకు అవకాశం కల్పించాలి. నూతన జిల్లాలో వర్క్‌టూ రూల్ కింద నియమితులైన ఉద్యోగులను వారి కోరిక మేరకు బదిలీ చేయాలి. ఇది ప్రభుత్వానికి ఆర్థిక భారం లేని సమస్య. కాబట్టి వెంటనే పరిష్కరించాలి. వసతి గృహాల్లో నాల్గో తరగతి ఉద్యోగుల స్థానాలు ఖాళీలు లేకుండా చూడాలి. ఉద్యోగుల నియామక, పదోన్నతుల్లో జోనల్ వ్యవస్థను రద్దు చేయాలి. ఉద్యోగుల పదోన్నతులను నెలనెలా సీనియార్టీని బట్టి చేపట్టాలి.

- దుబ్బాక

శివాలయాల్లో ప్రదక్షిణ ఇలా చేయాలి !

భక్తి

- చప్పి విశ్వప్రసాద్‌శర్మ, పురోహితుడు, దుబ్బాక

అన్ని ఆలయాల్లో మాదిరిగా శివాలయాలల్లో ప్రదక్షిణ చేయరాదు. చాలామంది శివాలయాల చుట్టూ అన్ని దేవాలయాల్లోలాగే ప్రదక్షిణ చేస్తారు. దీనివల్ల ప్రదక్షిణ ఫలం లభించదు. శివాలయాల్లో ప్రదక్షిణ భిన్నంగా ఉంటుంది. ధ్వజస్తంభం ముందు నుంచి ప్రారంభించి, సోమసూత్రం వరకు వెళ్లి మళ్లీ అక్కడి నుంచి వెనుదిరిగి ధ్వజస్తంభం గుండా మళ్లీ సోమసూత్రం వరకు వచ్చి ప్రదక్షిణ చేయాలి. ధ్వజస్తంభం వరకు వచ్చినట్లయితే ఒక ప్రదక్షిణ పూర్తవుతుంది. సోమసూత్రం శివుడిని అభిషేకించిన నీటితో వెళ్లే ద్వారం. దీనిని దాటడం మహాపాపం. గుడి చుట్టూ తిరగడం భక్తులకు అనవాయితీగా మారింది. ఈ పద్ధతిని శివాలయాల్లో పాటించరాదు. భక్తులు తెలియక మహాఅపచారానికి పాల్పడుతున్నారు. అయితే తెలియక చేసిన దానికి తప్పులేదు. ప్రదక్షిణ ఫలం మాత్రం భక్తులకు లభించదు. శివాలయాల చుట్టూ ప్రదక్షిణ మూడు లేదా ఐదుసార్లు చేయవచ్చు. ప్రదక్షిణ చేస్తున్నంతసేపు శివనామస్మరణం తప్పక చేయాలి. అంతేగాక శివనామపంచాక్షరి మంత్రమైన ఓం నమః శివాయః స్మరించాలి. ప్రదక్షిణ చేస్తున్న భక్తులు సోమసూత్రం వద్దనే చేతులతో తాకి నమస్కరించాలి. ఈ విధానం పాటించిన భక్తులు శివానుగ్రహానికి పాత్రులవుతారు. శివుడిని అభిషేకించిన నీరు శిరస్సుపై చల్లుకుంటే పాపాలు ఎలా దూరమవుతాయో, అలాంటి ఫలం సోమసూత్ర స్పర్శవల్ల లభిస్తుందని శివపురాణం చెబుతోంది.



- దుబ్బాక

డీసీఎం ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

సంగారెడ్డి రూరల్: డీసీఎం ఢీ కొనడంతో గుర్తు తెలియని వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన సోమవారం రాత్రి సంగారెడ్డి రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. సంగారెడ్డి రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...కంది వైపు నుంచి వస్తున్న గుర్తు తెలియని వ్యక్తి (40) పోతిరెడ్డిపల్లి చౌరస్తాలోని ఉజ్వల వైన్స్ సమీపంలో రోడ్డు దాటుతున్న క్రమంలో జహీరాబాద్ నుంచి హైదరాబాద్ వెళుతున్న డీసీఎం వ్యాన్ ఎదురుగా వచ్చి ఢీ కొనడంతో తీవ్రంగా గాయాల పాలైన వ్యక్తిని చికిత్స నిమిత్తం సంగారెడ్డి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్సపొందుతూ మంగళవారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు ఎస్ఐ శివలింగం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మాజీ సర్పంచ్ మల్లారెడ్డి మృతి

కంది: కలివేముల మాజీ సర్పంచ్ మల్లారెడ్డి గుండెపోటుతో సోమవారం రాత్రి మృతి చెందాడు. మల్లారెడ్డికి గుండెపోటు రావడంతో సంగారెడ్డి ఆసుపత్రికి తీసుకురాగా రాత్రి 10 గంటల సమయంలో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కాగా మల్లారెడ్డి అంత్యక్రియలు మంగళవారం తన స్వగ్రామంలో జరిగాయి. ఈ అంత్యక్రియలకు సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పట్లోళ్ల నరహరిరెడ్డి, సీడీసీ చైర్మన్ విజయేందర్ రెడ్డి, ఇతర ప్రముఖులు హాజరయ్యారు. మల్లారెడ్డి కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ సానుభూతిని వ్యక్తం చేస్తూ ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు.

అనారోగ్యంతో కానిస్టేబుల్ మృతి

సంగారెడ్డి రూరల్: పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న అరుణ్‌కుమార్ అనారోగ్యంతో ఈ నెల 28న మధ్యాహ్నం 2 గంటల సమయంలో మృతి చెందాడు. నారాయణ్‌ఖేడ్ మండలం సంజీవ్‌రావుపేట గ్రామానికి చెందిన అరుణ్‌కుమార్ 1993లో పోలీసు కానిస్టేబుల్‌గా విధుల్లో చేరి పోలీసు శాఖకు విశిష్ట సేవలందించారు. అరుణ్‌కుమార్ అంత్యక్రియలు అతని స్వగ్రామంలోని సంజీవ్‌రావుపేటలో ఈ నెల 29న నిర్వహించారు. పోలీస్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు దుర్గారెడ్డి, కోశాధికారి ఆసిఫ్ అలీ పాల్గొని అరుణ్‌కుమార్ కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపి ఆయన కుటుంబానికి తక్షణ సాయంగా రూ.20వేల నగదును అందించారు. ఈ కార్యక్రమంలో నారాయణ్‌ఖేడ్ డీఎస్పీ యాదగిరి రాజు, సీఐ సైదా నాయక్, పటాన్‌చెరు పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'నిమజ్జనం' ఏర్పాట్ల పరిశీలన



చెరువును పరిశీలిస్తున్న బల్దియా కమిషనర్, కౌన్సిలర్లు

జోగిపేట: వినాయక నిమజ్జనానికి చెరువు వద్ద చేపట్టిన ఏర్పాట్లను అందోలు-జోగిపేట నగర పంచాయతీ ఇన్‌చార్జి కమిషనర్ అంబదాస్ రాజేశ్వర్ మంగళవారం పరిశీలించారు. కౌన్సిలర్లు గొల్లశరత్, శశి రవిశేఖర్ రెడ్డితో కలిసి ఆయన స్థానిక అందోలు (రంగనాయక సాగర్) చెరువు వద్ద చేపట్టిన బారి కేడ్ల ఏర్పాట్లు, స్థలం చదును చేయడం, విద్యుత్ దీపాల ఏర్పాట్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నగరపంచాయతీ సిబ్బంది రాందాస్, భిక్షపతి, మహేందర్ పాల్గొన్నారు.

కష్టపడేవారిని పార్టీ మరచిపోదు

- సైనికుల్లా పనిచేయండి
- మహిళా కాంగ్రెస్ ఉమ్మడి జిల్లా అధ్యక్షురాలు నిర్మలారెడ్డి

సంగారెడ్డి రూరల్: కష్టపడేవారిని పార్టీ ఎన్నడూ మరిచిపోదని మహిళా కాంగ్రెస్ ఉమ్మడి జిల్లా అధ్యక్షురాలు నిర్మలారెడ్డి అన్నారు. కొండాపూర్ మండలం మల్కాపూర్ చింతల్ పరిధిలో ఓ గార్డెన్‌లో మంగళవారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఒక భవంతి పదికాలాల పాటు బాగుండాలంటే ఆ భవనం నిర్మాణం నుంచే పునాదులు గట్టిగా నిర్మించాలని, అదే విధంగా మన కాంగ్రెస్ పార్టీ కూడా బలంగా ఉండాలంటే కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని సూచించారు. ఇప్పుడు కష్టపడితే 2019 ఎన్నికల్లో అధికారం కాంగ్రెస్ పార్టీకే వరిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. మండల, భూత్ స్థాయి కమిటీలను వేసి నూతన కమిటీలను ఎన్నుకోవాలని అన్నారు. భూత్ స్థాయి నుంచి కార్యకర్తలు యుద్ధంలో సైనికులు పోరాడేలా పార్టీ కోసం పనిచేయాల్సిన అవసరమున్నదని అన్నారు. కష్టపడి పనిచేసే వారిని పార్టీ ఎన్నటికీ మరిచిపోదని, పార్టీ బలోపేతానికి కృషి చేసే కార్యకర్తలకే పదవులు వరిస్తాయన్నారు. టీఆర్ఎస్ పార్టీ గాలిలో కొట్టుకొచ్చిందని ఆ పార్టీ ఎక్కువ కాలం నిలవలేదని, రాబోయే ఎన్నికల్లో గాలిలో వచ్చిన విధంగానే గాలిలో కొట్టుకుపోతుందని ఎద్దేవా చేశారు. ఈ సమావేశంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పొన్నం శంకర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ అంజనేయులు, మాజీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, కంది మండలాధ్యక్షుడు బిక్షపతి, సదాశివపేట మాజీ మున్సిపల్ చైర్మన్ సత్యనారాయణ, నాయకులు పెప్పీ చంద్రశేఖర్, పాండు, అవినాష్, సంజీవ్‌కుమార్, శంకర్ నాయక్, జార్జి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నిర్మలారెడ్డి

మున్సిపల్ స్టేషనరీ పారవేత

- రోడ్డు పై నోటీసులు జారీ చేసే పేపర్ రోల్స్
- అధికారుల నిర్లక్ష్యంపై మండిపడుతున్న ప్రజలు

సదాశివపేట: సదాశివపేట మున్సిపాల్టీలో స్టేషనరీ దుర్వినియోగం అవుతున్నది. పట్టణ పరిధిలో నిర్మానుష్యమైన ప్రాంతంలో మంగళవారం పెద్ద ఎత్తున స్టేషనరీ సామగ్రి పారబోయడం కనిపించింది. కంప్యూటర్ ప్రింట్‌కు వాడాల్సిన పేపర్ బిండిల్స్ స్థానిక ఐబీ విశ్రాంతి గృహం వద్ద 65వ నెంబర్ జాతీయ రహదారికి ఇరువైపులా కుప్పలు.. కుప్పలుగా పడి ఉండడంతో వాటిని చూసిన ప్రజలు మున్సిపల్ అధికారుల పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలకు ఇంటి టాక్స్‌లు ఇస్యూ జారీ చేయాల్సిన డిమాండ్ నోటీసులు వర్షం నీటిలో బురద గుంతల్లో పడి తడిసి వృథా కావడంపై పలువురు మండిపడుతున్నారు. ప్రజల నుంచి వివిధ రకాల పన్నుల రూపంలో వసూలు చేసిన పెకం లక్షలాది రూపాయలను ఖర్చు చేసి మున్సిపల్ అధికారులు ముద్రణా సామగ్రిని కొనుగోలు చేస్తున్నారు. పేపర్‌ను పొదుపుగా వినియోగించుకోవాలని ప్రభుత్వం, పర్యావరణవేత్తలు సూచిస్తున్నా బల్దియా అధికారుల చెవికి ఎక్కడం లేదనిపిస్తోంది. ఎంతో విలువైన కంప్యూటర్ పేపర్ రోల్స్ (బిండల్స్)ను రోడ్డుపై పారవేయడం విమర్శలకు తావిస్తున్నది. మున్సిపల్ కార్యాలయంలో పలు రకాల సేవల కోసం అర్జీలు పెట్టుకునే ప్రజలెవరైనా తమ దరఖాస్తులను తెలిసో తెలియకో అసంపూర్తిగా పూరించినా వాటిని స్వీకరించేందుకు కస్సు బుస్సుమనే అధికారులు, సిబ్బంది ప్రజాధనాన్ని మాత్రం ఇలా తమ ఇష్టారాజ్యంగా దుర్వినియోగం చేస్తుంటే వారిని ఏమనాలని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.



సదాశివపేట మున్సిపాలిటీ పేరున ముద్రించిన ఇంటి టాక్స్ డిమాండ్ నోటీసులు

సామూహిక సెలవు వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

పుల్‌కల్: పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలంటూ సెప్టెంబరు 1న సామూహిక సెలవు పెడుతూ ప్రచురించిన వాల్‌పోస్టర్‌ను సీపీఎస్ ఉపాధ్యాయులు ఆవిష్కరించారు. మండలంలోని కోర్పోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశానంతరం వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. టీఎస్‌సీపీఎస్‌ఈఏ జిల్లా అధ్యక్షుడు ఎస్.ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో జీవో ఎంఎస్ నంబర్ 653, 654, 655 ద్వారా అమలవుతున్న సీపీఎస్ విధానము (నూతన పెన్షన్ సిస్టం)ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు రవి, సి.శ్రీనివాస్, వివిధ ఉపాధ్యాయ సంఘాలకు చెందిన నాయకులు గంధం మల్లికార్జున్, జగన్‌మోహన్‌రెడ్డి, యాదగిరి, కె.శ్రీనివాసచారి, రాజమల్లయ్య, రవీందర్, శ్రీనివాసులు, శివకుమార్, పద్మనాభం, ఇజాజ్‌అహ్మద్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వివాహిత మృతి

జహీరాబాద్: పట్టణంలోని శ్రీరాం మహల్లాకు చెందిన సంధ్యారాణి(24) మంగళవారం అనుమానాస్పదస్థితిలో ఆత్మహత్య చేసుకుని మృతి చెందింది. సంధ్యారాణికి 3 సంవత్సరాల క్రితం శివప్రసాద్‌తో వివాహం జరిగింది. మృతురాలికి సంవత్సరం కుమారుడు ఉన్నట్లు స్థానికులు తెలిపారు.

'నాయీ' వృత్తిదారుల నోట్లో మట్టి

- నాయీబ్రాహ్మణ జిల్లా అధ్యక్షుడు నర్సింలు

సంగారెడ్డి రూరల్: నాయీబ్రాహ్మణుల అభివృద్ధి, సంక్షేమానికి పాటుపడాల్సిన ప్రభుత్వం ఆ వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న వారి నోట్లో మట్టి కొట్టే ప్రయత్నం చేస్తున్నదని నాయీబ్రాహ్మణ జిల్లా అధ్యక్షుడు నర్సింలు విమర్శించారు. సంగారెడ్డిలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నాయీ బ్రాహ్మణుల అభివృద్ధికి రూ.250 కోట్లు కేటాయించాలని ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపి ఎదురుచూస్తున్న తరుణంలో బ్యూటీ పార్లర్, మొబైల్ పార్లర్లను తెరపైకి తీసుకువచ్చి నోటికాడి కూడును లాగేసుకున్న చందంగా ప్రభుత్వం తయారైందని ఎద్దేవా చేశారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని విరమించుకోవాలని లేని పక్షంలో నాయీబ్రాహ్మణులందరూ ఏకమై ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో నాయకులు రాజు, అశోక్, నర్సింలు, వెంకటేష్, విజయ్, ప్రకాష్, శివకుమార్, రవి, మల్లేశ్, రాజు, అశోక్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.



బ్రహ్మంగారి తండాలోని ప్రాథమిక పాఠశాలను పరిశీలిస్తున్న డీఈవో

ఉపాధ్యాయుడి సస్పెన్షన్

- సమయపాలన పాటించకపోతే ఉపేక్షించేది లేదు
- డీఈవో విజయకుమారి
- పలు పాఠశాలల్లో ఆకస్మిక తనిఖీలు

కొండాపూర్: ఉపాధ్యాయులు సమయపాలన పాటించకపోవడంపై డీఈవో విజయకుమారి ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం మండలంలోని బ్రహ్మంగారి తండా ప్రాథమిక పాఠశాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్నం 12గంటలైనా పాఠశాల తెరవకపోవడంతో ఆ పాఠశాల ఉపాధ్యాయుడు చక్రేశ్వర్‌ను సస్పెండ్ చేశారు. అనంతరం డీఈవో మాట్లాడుతూ సమయపాలన పాటించకపోతే ఉపేక్షించేది లేదన్నారు. అనంతరం తమల్‌బాయి తండా, తెర్పోల్ జిల్లా ఉన్నత పరిషత్ పాఠశాలను తనిఖీ చేశారు. పదో తరగతి పరీక్షల్లో మంచి ఫలితాలు వచ్చేలా బోధన చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో భీంసింగ్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఎస్ విధానానికి నిరసనగా

రెవెన్యూ ఉద్యోగుల ఆందోళన



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న శివప్రసాద్ తదితరులు

సంగారెడ్డి అర్బన్: సీపీఎస్ విధానంతో కేంద్ర ప్రభుత్వం ఉద్యోగుల హక్కులను కాలరాస్తోందని తెలంగాణ రెవెన్యూ ఉద్యోగుల సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వై.శివప్రసాద్ మండిపడ్డారు. సంగారెడ్డిలోని ఐబీలో మంగళవారం వివిధ ఉద్యోగ సంఘాల జేఏసీ ప్రతినిధులతో కలిసి సీపీఎస్ విధానం రద్దు కార్యాచరణ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శివప్రసాద్ మాట్లాడుతూ వెంటనే సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 30న మండల, డివిజల్, జిల్లా కేంద్రాల్లో జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టబోయే ర్యాలీల్లో పాల్గొనాలని, అదే విధంగా సెప్టెంబర్ 1న నల్లబ్యాడ్జీలు ధరించి భోజన విరామ సమయంలో నిరసన తెలపాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీఎన్జీవో కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి ఎం.రాజేందర్, జిల్లా అసోసియేషన్ సభ్యులు సుశీల్‌బాబు, జావేద్‌అలీ, నర్సింలు, డివిజన్ కార్యదర్శి సురేశ్‌కుమార్, సభ్యులు గౌసొద్దీన్, శ్రీనివాస్, గోపాల్, ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

మాతాశిశు మరణాలు అరికట్టడమే లక్ష్యం

సిద్దిపేట రూరల్: మాతాశిశు మరణాలు అరికట్టడమే ప్రభుత్వ లక్ష్యమని మహిళా శిశు సంక్షేమ శాఖ సిద్దిపేట, జనగామ జిల్లాల కో ఆర్డినేటర్ బూర విజయ అన్నారు. సిద్దిపేట మండలం తోర్నాల గ్రామంలో మంగళవారం జరిగిన అంగన్‌వాడీ టీచర్ల కార్యక్రమానికి ఆమె హాజరై మాట్లాడారు. ప్రభుత్వం పేదల ఆరోగ్యం కోసం కృషి చేస్తోందని, ప్రతి వెయ్యి మందికి ఒక అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటు చేస్తున్నమన్నారు. ఆరు సంవత్సరాలలోపు పిల్లలందరినీ స్థానిక అంగన్‌వాడీ కేంద్రానికి పంపాలన్నారు. గర్భిణి, బాలింతలకు పౌష్టికాహారం అందించేందుకు ఆరోగ్యలక్ష్మి పథకం ప్రవేశ పెట్టిందన్నారు. నాణ్యమైన ఆహారం అందించాలని సూచించారు. అనంతరం సిద్దిపేటలోని హౌసింగ్ బోర్డు కాలనీలో జరిగిన అర్బన్ ప్రాంతం అంగన్‌వాడీ టీచర్ల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమా, సర్పంచ్ పరమేశ్వర్ గౌడ్, ఎంపీటీసీ నర్సింలు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

మహిళా సాధికారతకు డీడీఎస్ కృషి అభినందనీయం

ఎమ్మెల్యే గీతారెడ్డి

జహీరాబాద్: మహిళా సాధికారత కోసం డీడీఎస్ చేస్తున్న కృషి అభినందనీయమని పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే, ఏఐసీసీ సౌత్‌జోన్ కో ఆర్డినేటర్ జె.గీతారెడ్డి అన్నారు. మంగళవారం డీడీఎస్-కేవీకే ఆధ్వర్యంలో 'సంకల్పంతో సాకారం' అనే కార్యక్రమాన్ని అల్గోల్ శివారులోని కృషి విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే గీతారెడ్డి మాట్లాడుతూ తెలంగాణలో ఇరిగేషన్ సౌకర్యాలు లేవని, వర్షాధారంగా చిరుధాన్యాల పంటలు ఇక్కడి రైతులు పండిస్తారని పేర్కొన్నారు. చిరుధాన్యాల సాగుతో సేంద్రియ విధానంతోనే అధిక పంటలు పండిస్తున్న రైతుల కృషి అభినందనీయమన్నారు. చిరుధాన్యాల పంట గింజలు రోజు వారిగా ఆహారంగా తీసుకుంటే ఎలాంటి వ్యాధులు దరిచేరవన్నారు. పోషక విలువలు ఉన్న చిరుధాన్యాలు ఈ ప్రాంతంలో లభించడం సంతోషించదగిన విషయమన్నారు. ప్రభుత్వం ఇక్కడి ప్రాంత రైతుల కోసం ఇరిగేషన్ సౌకర్యాలను కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లా వ్యవసాయ అధికారిణి ఎస్.శైలజ మాట్లాడుతూ 2022నాటికి రైతులు తమకు వచ్చే ఆదాయాన్ని రెట్టింపు చేసుకోవడానికి అవలంబించాల్సిన పద్ధతులను వివరించారు. రైతులు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సహకాలను సద్వినియోగం చే సుకుని అభివృద్ధి చెందాలన్నా రు. రైతులు తమకు అందుబాటులో ఉండే పశువుల ఎరువు తో పాటు వర్మికంపోస్టులను భూసారం పెంచేందుకు వినియోగించుకోవాలన్నారు. వీలైనంత వరకు పురుగు మం దుల నివారణ కోసం స్థానిక సేంద్రియ విధానాలనే పాటించాలన్నారు. కార్యక్రమంలో అసోసియేట్ ప్రొఫెసర్ సురేష్‌రెడ్డి, డీడీఎస్ జాయింట్ డైరెక్టర్ గిరిధర్, విత్తన సంరక్షకురాలు లక్ష్మమ్మ, ఆత్మ పీడీ కరుణాకర్ రెడ్డి, సర్పంచ్ గౌతంరెడ్డి, కేవీకే శాస్త్రవేత్తలు భార్గవి, శైలజ, గాయత్రి, యేగేష్, రాకేష్, సాంకేతిక నిపుణులు స్వామి, శ్రీకాంత్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



చిరుధాన్యాల విత్తనాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గీతారెడ్డి

పార్టీ అభివృద్ధికి సలహాలు ఇవ్వండి

మేధావుల సలహాలు, సూచనలను కాంగ్రెస్ పార్టీ స్వీకరించడానికి సిద్ధంగా ఉందని, పార్టీ అభివృద్ధి కోసం వారు అమూల్యమైన సలహాలు, సూచనలు అందించవచ్చని గీతారెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక సాయిరాం రెసిడెన్సీలో డాక్టర్ రామచంద్రారెడ్డి నేతృత్వంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గీతారెడ్డి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు ప్రజలు విసుగెత్తిపోయారన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ఎ ార్టీ మేధావుల సూచనలు, సలహాలను పరిగణలోకి తీసుకుని సమాజహితం కోసం పాటుపడేందుకు సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. సభ్యులందరు ఏఐసీసీ నెట్‌వర్క్‌లో చేరి సమాజాభివృద్ధికి కృషి చేయాలని కోరారు. సమావేశంలో ఐఎంఏ జహీరాబాద్ నాయకులు డాక్టర్ నవల్ కిశోర్, అజయ్‌శారడా, వైద్యులు డాక్టర్ చంద్రశేఖర్, వీరేశలింగం తదితరులు పాల్గొన్నారు.

ఉచిత చేపపిల్లల పంపిణీకి నేడు శ్రీకారం

- సింగూరు నుంచే ప్రారంభం
- హాజరు కానున్న మంత్రి శ్రీనివాసయాదవ్

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి) ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఉచిత చేపపిల్లల పంపిణీ రాష్ట్రంలోనే సంగారెడ్డి జిల్లా సింగూరులో బుధవారం ప్రారంభం కానుంది. రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్ బుధవారం ఉదయం 11.15 గంటలకు సింగూరు ప్రాజెక్టులో చేపపిల్లలను వదలి కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. ఈ సారి రాష్ట్ర వ్యాప్తంగా 70కోట్ల చేపపిల్లలను పంపిణీ చేయాలని లక్ష్యంగా నిర్ణయించారు. ఇందులో భాగంగా సంగారెడ్డి జిల్లాలో 3కోట్ల 60లక్షల చేపపిల్లలను ఉచితంగా పంపిణీ చేయాలని జిల్లా యంత్రాంగం ప్రణాళిక రూపొందించింది. 16,240 హెక్టార్ల విస్తీర్ణం గల సింగూరు జలాశయం, 11849 హెక్టార్ల విస్తీర్ణం కల మత్స్యశాఖ చెరువులు, 5469 హెక్టార్ల విస్తీర్ణం కల 1257 గ్రామ పంచాయతీ చెరువుల్లో ఈ చేపపిల్లలను వదలాలని జిల్లా యంత్రాంగం నిర్ధేశించుకుంది. గత సంవత్సరం కోటి 34 లక్షల రూపాయలను ఖర్చు చేసి కోటి 80 లక్షల చేపపిల్లలను చెరువులలో వేయడం జరిగింది. దీనివల్ల 7,758 మత్స్యకారకుటుంబాలకు లబ్ధి చేకూరింది. ఇలా ఉండగా సమీకృత మత్స్య అభివృద్ధి పథకం ద్వారా జిల్లాకు ఈ ఏడు 25 కోట్ల 61 లక్షల రూపాయలను కేటాయించినట్టు అధికారవర్గాలు తెలిపాయి. ఇందులో రెండు కోట్ల రూపాయలను పటాన్‌చెరు హోల్‌సెల్ చేపల మార్కెట్ నిర్మాణానికి మంజూరు చేశారు. అలాగే సంగారెడ్డి, జోగిపేట, సదాశివపేట, జహీరాబాద్, నారాయణఖేడ్, జిన్నారం, చిద్రుప్పలలో రిటైల్ చేపల మార్కెట్ల నిర్మానాలకు 10 లక్షల రూపాయల చొప్పున కేటాయించారు. జిల్లాలోని మత్స్యకారుల కోసం 10 లక్షల రూపాయల యూనిట్ విలువతో 13 కమ్యూనిటీ హాళ్లు మంజూరయ్యాయి. అలాగే చేపల విక్రయం కోసం 4 లక్షల రూపాయల యూనిట్ విలువలో 75 శాతం సబ్సిడీతో 9 టాటాఏసీ వాహనాలను, 40 వేల రూపాయల యూనిట్ విలువలో 75 శాతం సబ్సిడీపై 41 మోపెడ్‌లను లబ్ధిదారులకు అందజేసినట్టు అధికారవర్గాలు పేర్కొన్నాయి. సంగారెడ్డి మండలం కలబ్‌గూర్‌లోని చేపపిల్లల కేంద్రం ఉత్పత్తి సామర్థ్యం పెంచడానికి, జిల్లాకు అవసరమైన చేపపిల్లలను ఉత్పత్తి చేసేందుకు 5 కోట్ల 29 లక్షల రూపాయలు మంజూరైనట్టు ఆ వర్గాలు తెలిపాయి.

నేడు సింగూరుకు మంత్రి తలసాని రాక

పుల్‌కల్: సింగూరు ప్రాజెక్టులో చేప పిల్లలు విడుదల చేసేందుకు బుధవారం మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ రానున్నారని సీడీసీ డైరెక్టర్ జైపాల్ నాయక్ తెలిపారు. ఉదయం 10గంటలకు హైదరాబాద్ నుంచి బయలుదేరి నేరుగా సింగూరు ప్రాజెక్టుకు చేరుకుంటారని పేర్కొన్నారు. అందోల్ శాసన సభ్యుడు బాబుమోహన్‌తో కలిసి సింగూరుకు వస్తారని తెలిపారు. తాడ్దానిపల్లి నుంచి సింగూరు ప్రాజెక్టు వరకు మోటారు బైక్ ర్యాలీ నిర్వహిస్తామన్నారు. టీఆర్‌ఎస్ శ్రేణులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు.

విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలి

పెద్దశంకరంపేట: తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారంగా నిర్వహించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాంచరణ్ యాదవ్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ సమయంలో కేసీఆర్, హరీశ్ రావు తాము అధికారం లోకి వస్తే విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహిస్తామన్నారు. కానీ అధికారంలోకి రాగానే మాట మార్చారని ఆరోపించారు. సీఎం కేసీఆర్ ఎంఐఎంకు తొత్తుగా మారారని విమర్శించారు. సెప్టెంబర్ 17న బీజేపీ ఆధ్వర్యంలో బూత్ స్థాయిలో విమోచన దినోత్సవం జరుపుతామని ప్రకటించారు. రాష్ట్రంలో ఇసుక మాఫియా, డ్రగ్ మాఫియా పెరిగి పోతు న్నా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. 2019లో బీజేపీ అధికారంలోకి వస్తుందన్నారు. ఆయన వెంట నాయకులు భిక్షపతి, నారాయణలు ఉన్నారు.



మాట్లాడుతున్న రాంచరణ్ యాదవ్

టీఆర్‌ఎస్‌కు ఓటు అడిగే అర్హత లేదు

రేగోడు: టీఆర్‌ఎస్ ప్రభుత్వానికి ఓటు అడిగే అర్హత లేదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాంచరణ్ అన్నారు. మంగళవారం రేగోడులో జరిగిన బీజేపీ, బీజేవైఎం కార్యవర్గ సమావేశంలో పాల్గొని ప్రసంగించారు. మిషన్ భగీ రథ నీరు వచ్చే ఎన్నికల్లో ఓట్లు అడుగుతామని చెప్పిన సీఎం మాటపై నిలబడాలని సూచించారు. అబద్దాలతో ప్రజలను మభ్య పెడుతూ పాలన సాగిస్తున్నారన్నారు.

అర్బన్ హెల్త్ సెంటర్‌ను సందర్శించిన ఎన్‌హెచ్‌ఎం బృందం

సంగారెడ్డి అర్బన్: పట్టణంలోని మార్క్సనగర్ అర్బన్ హెల్త్ సెంటర్‌ను మంగళవారం ఎన్‌హెచ్‌ఎం కేంద్ర బృందం సభ్యులు సందర్శించారు. సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. అదే విధంగా సెంటర్‌లోని మౌలిక వసతులు, ఫార్మసీ, వ్యాక్సినేషన్ రికార్డులను పరిశీలించారు. హెల్త్ సెంటర్‌ను సందర్శించిన వారిలో ఎన్‌హెచ్‌ఎం కన్సల్టెంట్ శ్రద్ధ, ఎన్‌యూహెచ్‌ఎం కన్సల్టెంట్లు శిల్పి, సందేశ్, హైదరాబాద్ ఎన్‌యూహెచ్‌ఎం ప్రోగ్రాం ఆఫీసర్లు ప్రకాశ్, సిద్దార్థ్, జిల్లా వైద్యాధికారి మోజీరాంరాథోడ్, డీఐవో సరళ కుమారి, అర్బన్‌హెల్త్ సెంటర్ వైద్యులు అనిల్‌కుమార్ ఉన్నారు.



సిబ్బందితో మాట్లాడుతున్న ఎన్‌హెచ్‌ఎం బృందం సభ్యులు

గొర్రె దాటలేదు!

- మందకొడిగా సాగుతున్న గొర్రెల పంపిణీ
- జిల్లా యంత్రాంగం నిర్దేశించిన లక్ష్యం 15,551 యూనిట్లు
- అందజేసింది 3,898 యూనిట్లే



గొర్రెలను మేపుతున్న కాపరులు

సంగారెడ్డి టౌన్: ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గొర్రెల పంపిణీ కార్యక్రమం జిల్లాలో మందకొడిగా సాగుతోంది. ఈ ఏడాది పూర్తి చేయాల్సిన లక్ష్యం తడబడింది. 2017-18లో 15,551 యూనిట్ల పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్దేశించింది. జిల్లాలో ఇప్పటివరకు కేవలం 3,898 యూనిట్ల గొర్రెలు మాత్రమే లబ్ధిదారులకు చేరాయి. గొల్ల, కురుమ, యాదవుల కుటుంబాల్లో ఆర్థిక స్వావలంబనకు సీఎం కేసీఆర్ ప్రత్యేకంగా ప్రవేశపెట్టిన ఈ కార్యక్రమం ఆశించిన స్థాయిలో అమలుకావడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. జిల్లా కేంద్రం సంగారెడ్డిలో జూన్ 20న నిర్వహించిన గొర్రెల పంపిణీ కార్యక్రమాన్ని మండలి చైర్మన్ స్వామి గౌడ్, ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, కలెక్టర్ మాణిక్కరాజ్ కన్నన్ ప్రారంభించారు. మొదట్లో అధికారులు ఎంతో ఉత్సాహాన్ని ప్రదర్శించారు. క్రమంగా పథకం నీరు గారిపోతోందనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి.

509 సొసైటీలు

గొర్రెల పంపిణీ కార్యక్రమాన్ని పారదర్శకంగా చేపట్టాలన్న ఉద్దేశ్యంతో జిల్లాలోని అన్ని గ్రామాల్లో గొల్ల, కురుమ, యాదవులతో సభలు నిర్వహించి సహకార సంఘాలను అధికారులు ఏర్పాటు చేశారు. అందులో భాగంగా జిల్లాలో 509సహకార సంఘాలు ఏర్పాటయ్యాయి. అందులో 30,896 మంది సభ్యులుగా చేరారు. వారందరికీ రెండేళ్లలో విడతల వారీగా ఏ-గ్రేడ్, బీ-గ్రేడ్‌లుగా విభజించి గొర్రెలను పంపిణీ చేయాలని అధికార యంత్రాంగం నిర్ణయించింది. 2017-18లో 15,551 మందికి, 2018-19లో 15,345 మందిని ఎంపిక చేసింది. ఈ ఏడాది 15,551 మంది లబ్ధిదారులను లాటరీ విధానంలో ఎంపిక చేసింది. జూన్ 20న కార్యక్రమం ప్రారంభం కాగా, ఇప్పటివరకు కేవలం 3,898 మందికి మాత్రమే గొర్రెలను పంపిణీ చేసింది.

ఆంధ్రప్రదేశ్ నుంచి దిగుమతి

లబ్ధిదారులకు అవసరమైన గొర్రెలను ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు, కడప, అనంతపూర్ జిల్లాల్లో నుంచి దిగుమతి అయ్యాయి. కలెక్టర్ మాణిక్కరాజ్ ఆదేశాల మేరకు జిల్లా పశు సంవర్ధక శాఖకు చెందిన ఆరుగురు అధికారుల బృందం మూడు జిల్లాలో మకాం వేసి ఆరోగ్యవంతమైన గొర్రెలను కొనుగోలు చేసి, ఇక్కడికి తరలిస్తున్నట్టు సమాచారం. ఈ బృందంలో ఒక్కో జిల్లాలో ఇద్దరు అధికారులు చొప్పున ఉన్నారు. వీరిలో ఒక వెటర్నరీ వైద్యుడు, ఒక అసిస్టెంట్ డైరెక్టర్ ఉన్నట్టు తెలిసింది. గొర్రెలను కొనుగోలు చేసే చోటే ఫొటో ట్యాగింగ్ చేసి, వాటి ఆరోగ్య పరిస్థితులను బట్టి రవాణా చేస్తున్నట్లు తెలిసింది.

రీసైక్లింగ్‌కు తావీయకుండా...

గొర్రెల పంపిణీ పథకంలో ఎలాంటి అక్రమాలు, రీసైక్లింగ్‌లు జరకుండా జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తంగా వ్యవహరిస్తోంది. ఈ పథకం కింద పంపిణీ చేసిన గొర్రెలను కొంతమంది రీసైక్లింగ్ చేస్తున్నట్టు ఆరోపణలు గుప్పుమన్నాయి. దీంతో అప్రమత్తమైన అధికారులు జిల్లాలో గట్టి నిఘాను ఏర్పాటు చేశారు. ఇతర ప్రాంతాలకు గొర్రెల రవాణా కాకుండా సరిహద్దుల్లో ప్రత్యేక చెక్‌పోస్టులను ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ మేరకు న్యాల్‌కల్, మనూర్, కంగ్టి, జహీరాబాద్, మాసాన్‌పల్లి తదితర ప్రాంతాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటయ్యాయి.

రవాణా ఖర్చు రూ.6,300

గొర్రెల పంపిణీ పథకంలో గొర్రెలతోపాటు లబ్ధిదారులకు ప్రభుత్వం బీమా సౌకర్యం కల్పించింది. ఒక్కో యూనిట్‌లో 20గొర్రెలు, పొట్టేలు ఉంటుంది. యూనిట్ విలువ రూ.1.25లక్షలు. ఇందులో రూ.6,300 రవాణాకు, రూ. 7,700 గొర్రెల లబ్ధిదారులకు బీమా, దాణాకు ప్రభుత్వం కేటాయించింది.

100 గొర్రెల మృత్యువాత

జిల్లాలో ఇప్పటివరకు పంపిణీ చేసిన 3,898 గొర్రెల యూనిట్లలో 100 మృతి చెందాయి. కర్నూలు, కడప, అనంతపూర్ జిల్లాల నుంచి రవాణా చేస్తున్న సమయంలో అనారోగ్యానికి గురైన కంగ్టి, మనూరు, నారాయణఖేడ్ తదితర ప్రాంతాల్లో అనారోగ్యంతో 70గొర్రెలు మృతి చెందాయి. కాగా ఐదురోజుల క్రితం కర్నూల్ జిల్లాలో కొనుగోలుచేసి లారీలో హత్నూరకు తెస్తుండగా, పటాన్‌చెరు సమీపంలోని ఔటర్‌రింగ్ రోడ్డుపై జరిగిన ప్రమాదంలో లారీలోని 29 గొర్రెలు మృతి చెందాయి. అయితే లబ్ధిదారులకు పంపిణీ చేసిన గొర్రెలు ఈనడంతో 2వేల గొర్రెపిల్లలు పుట్టినట్టు సమచారం. ఆయా మండలాల్లోని గొర్రెలు ఈనడంతో లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఒక గొర్రె రెండేళ్లలో మూడుసార్లు ఈనుతుందని పశువైద్యాధికారులు తెలిపారు.

9 మెట్రిక్ టన్నుల గడ్డి విత్తనాల పంపిణీ

ప్రభుత్వం పంపిణీ చేసిన గొర్రెల కోసం జిల్లాలో 9మెట్రిక్ టన్నుల గడ్డి విత్తనాలను సరఫరా చేసింది. ఇందులో ఒక మెట్రిక్ టన్ను గడ్డి విత్తనాలను అటవీ శాఖకు, ఒక మెట్రిక్ టన్నును హార్టికల్చర్ శాఖ ఆధ్వర్యంలో పండ్ల తోటల్లో పెంచుతున్నట్టు పశు సంవర్ధకశాఖ తెలిపింది. మిగతా 7మెట్రిక్ టన్నుల గడ్డి విత్తనాలను ఉచితంగా లబ్ధిదారులకు అందించింది. ఈ గడ్డి విత్తనాలను వేసిన 40రోజుల్లోగా గొర్రెలకు మేపడానికి అందుబాటులోకి వస్తుంది.



రైతులతో మాట్లాడుతున్న బ్యాంక్ సిబ్బంది

రుణాల కోసం రైతుల రాస్తారోకో

- కాలయాపన చేస్తున్నారంటూ ఆగ్రహం

రాయికోడ్: సకాలంలో రుణాలను ఇవ్వాలని డిమాండ్ చేస్తూ రైతులు రాస్తారోకోతో నిరసన వ్యక్తం చేశారు. మంగళవారం రాయికోడ్‌లోని ఏపీజీవీబీ బ్యాంకు ఎదుట ప్రధార రహదారిపై రైతులు మాట్లాడుతూ 15రోజుల నుంచి రుణాలు మంజూరు, రెన్యువల్ చేయడంలో తీవ్ర జాప్యమవుతోందన్నారు. కొత్త మేనేజర్ వచ్చినా రుణాలు ఇవ్వడం లేదని మండిపడ్డారు. 10రోజుల నుంచి పనులు మానుకుని బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నామని వాపోయారు. దీంతో విసుగు చెంది రాస్తారోకో చేపట్టినట్టు తెలిపారు. సుమారు గంట పాటు రాస్తారోకో నిర్వహించడంతో ఇరువైపులా భారీగా వాహనాలు నిలిచిపోయాయి. దీంతో బ్యాంక్ సిబ్బంది రైతులతో మాట్లాడారు. ఆన్‌లైన్ సరిగ్గా పని చేయకపోవడంతోనే సమస్య తలెత్తుతుందన్నారు. మూడ్రోజులుగా ఎలాంటి లావాదేవీలు నిర్వహించడం లేదని వారు పేర్కొన్నారు. సమస్య పరిష్కారమైతే రుణాలు మంజూరు, రెన్యువల్ చేస్తామని బ్యాంక్ సిబ్బంది హామీ ఇచ్చారు. దీంతో రైతులు రాస్తారోకో విరమించారు. కార్యక్రమంలో రైతులు నయాంపటేల్, శంకరప్ప, వెంకట్ రాములు, మాణయ్య, రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

ఈపీఎఫ్‌ను రూ.5వేలకు పెంచాలి

- బీఎంఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు లక్ష్మారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మారెడ్డి

సంగారెడ్డి అర్బన్: ఈపీఎఫ్‌ను కనీసం రూ.5వేలకు పెంచాలని బీఎంఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు కె.లక్ష్మారెడ్డి డిమాండ్ చేశారు. సంగారెడ్డిలోని బీకేఎస్ భవనంలో మంగళవారం బీఎంఎస్, వికాస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈపీఎఫ్ పెన్షనర్స్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 30ఏళ్లు ఉద్యోగం చేస్తే పదవీ విరమణ తరువాత కేవలం వెయ్యి రూపాయల్లోపే పెన్షన్ వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కనీస పెన్షన్ రూ.5వేలు చేయాలని డిమాండ్ చేస్తే వెయ్యి రూపాయలకు కుదించడం బాధాకరమన్నారు. కార్మికులు పదవీ విరమణ తర్వాత అనేక ఆరోగ్య సమస్యలతో సతమతమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. భవిష్య నిధి ట్రస్టు బోర్డు సభ్యుడు జగదీశ్వర్‌రావు మాట్లాడుతూ గత పాలకుల తీరుతోనే పింఛను పథకంలో కార్మికులకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. ట్రస్టులో బీఎంఎస్ ఒక్కరే కార్మికుల తరఫున తీవ్రంగా పోరాడుతున్నట్టు వివరించారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు మోహన్‌రెడ్డి, సంఘటన కార్యదర్శి విజయ్‌కుమార్, మండల కార్యదర్శి నర్సింహారెడ్డి, పెన్షనర్లు కృష్ణారెడ్డి, రాంరెడ్డి, మురళీ, రాజేశ్వర్‌రావు, విఠల్ పాల్గొన్నారు.

పత్తివైపే మొగ్గు

- 'ఖేడ్'లో గణనీయంగా పెరిగిన సాగు
- పంట సాధారణ విస్తీర్ణం 1,88,110 హెక్టార్లు
- ఈసారి 1,98,477 హెక్టార్లలో...



నారాయణఖేడ్‌లో పత్తిలో అంతరపంటగా సాగుచేసిన పెసర

నారాయణఖేడ్: అరకొర వర్షాలు.. ఆరుగాలం కష్టం.. వేసిన కంది పంట చేతికొచ్చింది. తీరా గిట్టుబాటు లేక రైతన్న కుదేలయ్యాడు. తక్కువ ధరకు దళారులకు విక్రయించడం కన్నా ప్రభుత్వ కొనుగోలు కేంద్రమే మేలని ధాన్యం అమ్మేశారు. డబ్బు కోసం కార్యాలయాల చుట్టూ చెప్పులరిగేలా తిరిగారు. మూడు నెలలపాటు అధికారులు చుక్కలు చూపించారు. ఈ కష్టాలన్నీ పత్తి సాగుకు రైతును పురిగోల్పాయి. పంట చేతికొస్తే వెంటనే విక్రయించే వెసులు బాటు ఉండడం మరో కారణం. ఫలితంగా నారాయణఖేడ్ డివిజన్‌లో పత్తి పంట విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. జిల్లా వ్యాప్తంగా గతేడాది పెసరను 49,490 హెక్టార్లలో సాగు చేయగా, ఈసారి 24,045 హెక్టార్లలో మాత్రమే సాగయింది. పత్తి సాధారణ సాగు విస్తీర్ణం 1,88,110 హెక్టార్లు కాగా, ఈసారి 1,98,477 హెక్టార్లలో సాగయింది. గతేడాది పత్తి సాగు విస్తీర్ణం తగ్గడంతోపాటు మార్కెట్లో గిట్టుబాటు ధర భాగుంది. దీంతో రైతులు మళ్లీ పత్తి సాగు పైనే దృష్టి సారించారు. పత్తి పంట సస్యరక్షణ చర్యలకే ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉంటుంది. దీనికి అడవి పందుల బెడద, ఇతర ఇబ్బందులు ఉండవని రైతులు పేర్కొంటున్నారు. నారాయణఖేడ్ డివిజన్ పరిధిలోని పత్తి పంట సాగు ఘనీయంగా పెరిగింది. సాధారణ సాగు కంటే 13,403 హెక్టార్లలో అధికంగా రైతులు పంటను వేశారు. పెసర సాధారణ సాగు 10,821 హెక్టార్లు కాగా, 7,760 హెక్టార్లలో,

తగ్గిన పప్పు దినుసుల సాగు

మినుము సాధారణ సాగు విస్తీర్ణం 6,481 హెక్టార్లు కాగా 4,709 హెక్టార్లలో, కంది సాధారణ సాగు 7,274 హెక్టార్లు కాగా, 7,398 హెక్టార్లలో సాగయింది. సోయా సాగు విస్తీర్ణం కూడా తగ్గింది. డివిజన్‌లో కేవలం 5,901 హెక్టార్లలో మాత్రమే రైతులు ఆ పంటను వేశారు. పత్తికి మార్కెట్లో ఉన్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని రైతులు అధికంగా సాగు చేయడంతో ఇతర పంటల సాగు తగ్గింది.

పత్తికి డిమాండ్ ఉంది



మార్కెట్లో పత్తి పంటకు మంచి డిమాండ్ ఉంది. అందుకే నాకున్న మొత్తం భూమిలో దాన్నే సాగు చేస్తున్నాను. పంట రక్షణలోనూ ఇబ్బందులుండవు. విక్రయించగానే డబ్బు చేతికొస్తుంది. పోయినసారి కంది వేసి పడిన తిప్పలు బాగా గుర్తున్నాయి.

- నారాయణరెడ్డి, రైతు, చాప్టా(కె)

పప్పు పంటలతో ఇబ్బందే



గతేడాది ప్రభుత్వం మాటలు నమ్మి పప్పు దినుసు పంట వేశాను. పంట చేతికొచ్చాక కొనేవాళ్లు లేరు. గిట్టుబాటు ధర లేదు. కొనుగోలు కేంద్రాల్లో అమ్మినా సకాలంలో డబ్బు అందలేదు. అందుకే ఈసారి పత్తి పంటను సాగు చేశాను.

- సాయిరెడ్డి, రైతు, అనంత్‌సాగర్



కల్లు గీత కార్మికులకు షరతులు లేకుండా ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం సంగారెడ్డిలోని ఎక్సైజ్ కార్యాలయం వద్ద కల్లు గీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆశన్నగౌడ్, రమేష్‌గౌడ్ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. **- సంగారెడ్డి రూరల్**

సినిమాలు

పటాన్‌చెరు	
ఎస్‌ఎస్‌వీ	జయ జానకి నాయక
రుక్మిణి	అర్జున్‌రెడ్డి
రామచంద్రాపురం	
సంగీత	జయ జానకి నాయక
జ్యోతి	ఫిదా

సదాశివపేట	
జ్యోతి	లై
మహేశ్వరి	అర్జున్‌రెడ్డి
బొల్లారం	
జ్యోతి	అర్జున్‌రెడ్డి

సంగారెడ్డి	
నటరాజ్	జయ జానకి నాయక
రుక్మిణి	నేనేరాజు నేనే మంత్రి
సితార	అర్జున్‌రెడ్డి
జోగిపేట	
శ్రీవెంకటేశ్వర	లై

వాటర్‌గ్రిడ్ పనులతో స్థానికులకు ఇబ్బందులు

రామచంద్రాపురం: పట్టణంలో కొనసాగుతున్న వాటర్‌గ్రిడ్ పనుల కారణంగా స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాంట్రాక్టర్ పైపులైన్ కోసం తీసిన గుంతలను మూసివేయకపోవడంతో మట్టి బురదగా మారడంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. భారీ వర్షాల కారణంగా గుంతల్లో వరదనీరు చేరి గుంతలు కనబడక పాదచారులు, ద్విచక్రవాహనదారులు వాటిలో పడి ప్రమాదాల బారిన పడుతున్నారు. ప్రధానంగా మల్లికార్జుననగర్, శ్రీనివాస్‌నగర్ కాలనీ, పాత రామచంద్రాపురం, ఎంఐజీ కాలనీల్లో గుంతలు మూయకపోవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. గుంతలు మూసే విధంగా అధికారులు కాంట్రాక్టర్‌పై ఒత్తిడి తీసుకురావాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

'నేటి నుంచి చేప పిల్లల పంపిణి'

జోగిపేట: రాష్ట్ర ప్రభుత్వం అన్ని కులాలు, వర్గాల వారి సంక్షేమానికి కృషి చేస్తున్నదని జోగిపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ డీబీ నాగభూషణం అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ సర్వజన సంక్షేమంలో భాగంగా, ముదిరాజులకు, గంగపుత్రుల అభ్యున్నతికి కూడా టీఆర్‌ఎస్ ప్రభుత్వం పాటుపడుతోందన్నారు. బుధవారం నుంచి ముదిరాజులకు, గంగపుత్రలకు (మత్స్యకారులకు) చేప పిల్లల ఉచిత పంపిణీ కార్యక్రమం ప్రారంభం కాబోతోందంటూ దీనిని మత్స్యకారులు సద్వినియోగం చేస్కోవలని ఆయన పిలుపునిచ్చారు. ఈసమావేశంలో టీఆర్‌ఎస్ నగర పంచాయతీ అధ్యక్షుడు చాపల వెంకటేశం, నాయకులు గాజుల అనిల్, సత్తిబాబు, అల్లె గోపాల్, నాగరాజు పాల్గొన్నారు.

'తట్టు వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి'

వట్‌పల్లి: తట్టు (రుబెల్లా) వ్యాధిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆరోగ్య సిబ్బంది వినోద, శాంతకుమార్, పుష్పలత సూచించారు. మంగళవారం వట్‌పల్లి అంగన్‌వాడీ కేంద్రంలో 200మంది చిన్నారులకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వచ్చే నెల 25వ తేదీ వరకు అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ఉచితంగా మందుల పంపిణీ కార్యక్రమం ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ తమ పిల్లలకు తప్పనిసరిగా టీకాలు వేయించాలన్నారు. 9నెలల నుంచి 15సంవత్సరాల వయసు పిల్లలకు రుబెల్లా వ్యాక్సిన్‌ను వేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో లక్ష్మి, స్వప్న, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశావర్కలు పాల్గొన్నారు.

'ఇంటింటికీ మరుగుదొడ్డి తప్పని సరి'

వట్‌పల్లి: మండలంలోని అన్ని గ్రామాల్లో మరుగుదొడ్లు నిర్మించుకునే విధంగా ప్రజలను అప్రమత్తం చేయాలని సంగారెడ్డి స్వచ్ఛభారత్ మిషన్ ప్రేరక్ హరీష్‌కుమార్ తెలిపారు. మంగళవారం స్వచ్ఛభారత్ ఆధ్వర్యంలో మరుగుదొడ్ల నిర్మాణంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రతి గ్రామంలోని కుటుంబాలు మరుగుదొడ్లను నిర్మించుకునే విధంగా పంచాయతీ సెక్రటరీలు, ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్లు కృషి చేయాలన్నారు. మండలానికి 3347 మరుగుదొడ్లు మంజూరయ్యాయని, గ్రామానికి 200 చొప్పున కేటాయించారన్నారు. నిర్మించుకున్న మరుగుదొడ్డికి స్వచ్ఛభారత్ మిషన్ ద్వారా రూ.12వేలు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో విద్యాసాగర్, పంచాయతీ సెక్రటరీలు రాజలింగం, పరమేశ్వర్‌గౌడ్, ఫీల్డ్ అసిస్టెంట్‌లు గురుచరణం, అంబయ్య తదితరులు పాల్గొన్నారు.

'అందోలు' దళిత మోర్చా అధ్యక్షుడిగా నర్సింహులు


నియామక పత్రాన్ని అందుకుంటున్న నర్సింహులు

జోగిపేట: అందోలు మండల దళిత మోర్చా అధ్యక్షుడిగా చింతకుంటకు చెందిన గుండెగల్ల నర్సింహులు నియామకమయ్యారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్. ప్రభాకర్ గౌడ్ సమక్షంలో దళిత మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు రవీందర్, నర్సింహులుకు నియామకపత్రాన్ని అందజేశారు. ఈకార్యక్రమంలో బీజేపీ అందోలు నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రభాత్ కుమార్ జైస్వాల్, మున్సిపల్ మోర్చా జిల్లా అధ్యక్షుడు గాజుల నవీన్, కిసాన్ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి రుద్రారం మాణయ్య, పట్టణ పార్టీ మాజీ అధ్యక్షుడు ఆర్. జగన్నాథం పాల్గొన్నారు.

అంత్యక్రియలకు 'పులిగిల్లా' ఆర్థిక సహాయం

గుమ్మడిదల: కానుకుంట గ్రామంలో పేద కుటుంబానికి చెందిన ఇద్దరు వ్యక్తులు చనిపోగా, అంత్యక్రియలకు పులిగిల్లా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం అందజేశారు. నర్సింలు, డి.అజీం చనిపోయినందున వారి అంత్యక్రియాలకు ఒక్కో కుటుంబానికి 5వేల ఆర్థిక సహాయమ్ల ఫౌండేషన్ ప్రతినిధి సాయిభరత్ అందజేశారు.

వినాయక మండపాల్లో ప్రత్యేక పూజలు




రామచంద్రాపురం, పటాన్‌చెరు, పెద్దమ్మగూడెంలో వినాయకుడికి పూజలు చేస్తున్న బీజేపీ నాయకులు, ఎంపీపీ కాట సుధారాణి, నాయకులు

రామచంద్రాపురం: పట్టణంలోని వివిధ వినాయక మండపాల్లో మంగళవారం పటాన్‌చెరు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ బి.పుష్పనగేష్‌యాదవ్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సి.అంజిరెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండపాల్లో జరిగిన అన్నదాన కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

పెద్దమ్మగూడెంలో

జిన్నారం: జిన్నారం పరిధిలోని పెద్దమ్మగూడెంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో జడ్పీ కాంగ్రెస్ ఫ్లోర్‌లీడర్ ప్రభాకర్ పాల్గొన్నారు. మంగళవారం పెద్దమ్మగూడెంలో ట్రాక్టర్ ఓనర్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. జడ్పీటీసీ ప్రభాకర్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, నాయ కులు శ్రీనివాస్‌యాదవ్, ఆంజనేయులు, సింహారెడ్డి పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులను నిర్వాహకులు సన్మానించారు.

పటాన్‌చెరులో

పటాన్‌చెరు: పటాన్‌చెరు పారిశ్రామిక వాడలో, అమీన్‌పూర్ పంచాయతీ పరిధిలోని పలు కాలనీల్లో వినాయక మండపాల వద్ద ప్రత్యేక పూజా కార్యక్రమాలు పెద్ద ఎత్తున కొనసాగుతున్నాయి. స్థానిక ఇంపీరియల్ గార్మెంట్ పరిశ్రమ వద్ద నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో రామచంద్రాపురం ఎంపీపీ, యూనియన్ వర్కింగ్ అధ్యక్షుడు యాదగిరియాదవ్ పాల్గొని పూజలు నిర్వహించారు. లాలాబాయికాలనీ, ఎన్‌ఎస్‌ఎల్.కాలనీ, బీరంగూడ, కిష్టారెడ్డిపేట, హెచ్‌ఎంటీ కాలనీ, భ్రమరాంబా ఎంక్లేవ్‌లలో అన్నదానాన్ని ఏర్పాటు చేశారు. అమీన్‌పూర్ ఎంపీటీసీ కాలసుధారాణి, వార్డు సభ్యులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

బొంతపల్లిలో

గుమ్మడిదల: మండలంలోని బొంతపల్లి వీరభద్ర నగర్ వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శక్తి యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపం వద్ద వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు గిద్దె రాజు, జిన్నారం మండల బీజేపీ అధ్యక్షుడు లక్ష్మణ్‌రావు, జిల్లా కార్యదర్శి గంగురమేశ్, నాయకులు బుక్క వెంకటేశ్, శ్రీకాంత్, సభ్యులు నారాయణ, రవి, సంపత్, కృష్ణ, భాస్కర్, నిఖిల్ పాల్గొన్నారు.

రైతును రాజును చేయడమే కేసీఆర్ లక్ష్యం

● అందోలు ఎమ్మెల్యే బాబూమోహన్

జోగిపేట/పుల్కల్: రైతును రాజుగా చేయడమే సీఎం కేసీఆర్ లక్ష్యమని అందోలు ఎమ్మెల్యే బాబూ మోహన్ అన్నారు. ఇందుకోసమే ఆయన ప్రభుత్వ సమన్వయ సమితుల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారన్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని తన నివాసంలో నియోజకవర్గ ముఖ్య నాయకులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బాబూ మోహన్ ప్రసంగిస్తూ వ్యవసాయరంగానికి కేసీఆర్ అధిక ప్రాధాన్యత నిస్తున్నారంటూ ప్రతి ఎకరాకు రూ.4 వేల చొప్పున యేడాదికి రెండుసార్లు పెట్టుబడుల కోసం డబ్బులు ఇచ్చే పథకమే దీనికి నిదర్శనమన్నారు. వీటితో పాటు నాణ్యమైన విత్తనాల సరఫరా, ఎరువుల సరఫరాను కూడా చేపట్టారన్నారు. వీటికి అదనంగా, గ్రామాల వారీగా రైతులకు, ప్రభుత్వానికి మధ్య సమన్వయం చేకూరుస్తూ వారికి అవసరమైన సలహాలను ఇచ్చేందుకే గ్రామ రైతుసమన్వయ కమిటీల ఏర్పాటును ప్రారంభిస్తున్నారన్నారు. అందోలు నియోజకవర్గంలో ని అన్ని గ్రామాల్లోనూ సెప్టెంబర్ 1 నుంచి 9 వరకు ఈ కమిటీల ఎన్నికను అనంతరం మండల కమిటీల ఎంపికను కూడా చేపట్టాలని ఆయన కార్యకర్తలకుసూచించారు. ప్రతి కమిటీలోనూ 24 మంది రైతులను, వీరిలో 15 మంది మహిళలతోపాటు అన్ని కులాల వారికి ప్రాధాన్యత కల్పించాలన్నారు. స్థానికంగా ఉంటూ వ్యవసాయం చేస్తున్న రైతులకు మాత్రమే క మిటీల్లో స్థానం కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ మాణిక్ రెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ సిద్దన్నపాటిల్, రేగోడ్ ఎంపీపీ మమత శ్రీశైలం, ఏఎంసీ చైర్మన్లు డీబీ నాగభూషణం(అ ందోలు), యేసయ్య (రాయికోడ్), కమ్రొద్దీన్ (వట్‌పల్లి), ఆత్మ కమిటీ చైర్మన్ లక్ష్మీకాంత్ రెడ్డి, చేనేత సంఘం చైర్మన్ వర్కల అశోక్, సీడీసీ డైరెక్టర్ జైపాల్ నాయక్, ఆత్మ డైరెక్టర్ సారశ్రీధర్, టీఆర్‌ఎస్ మండల శాఖల అధ్యక్షులు సుభాస్ రావు (అల్లాదుర్గం), వీరారెడ్డి (వట్‌పల్లి), గోవర్ధన్ (పుల్కల్), యూసుఫ్ (టే క్మాల్), నవాజ్‌రెడ్డి (మునిపల్లి), విఠల్ (రాయికోడ్), వినోద్ (రేగోడ్), నగరపంచాయతీ అధ్యక్షుడు చాపల వెంకటేశం, డీసీసీబీ మాజీ వైస్ చైర్మన్ జయపాల్ రెడ్డి, నాయకులు లింగాగౌడ్, నాగరత్నం గౌడ్, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బాబూమోహన్

'హక్కులకై పోరాడే యూనియన్‌ను బలపర్చండి'

పుల్‌కల్: కార్మిక హక్కుల పరిరక్షణ కోసం నిరంతరం పోరాడుతున్న 1104 యూనియన్‌ను బలపర్చాలని తెలంగాణ ఎలక్ట్రిసిటి ఎంప్లాయిస్ యూనియన్ నాయకుడు చంద్రయ్య కోరారు. మండలంలోని సింగూరు ప్రాజెక్టు జల విద్యుత్ కేంద్రం వద్ద మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. 2018లో నూతన వేతనాల సాధనతో పాటు ఒకే సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులందరికీ ఒకే మాస్టర్ స్కేల్ వర్తింపచేయాలని డిమాండ్ చేశారు. సెప్టెంబరు 8న జరుగనున్న యూనియన్ గుర్తింపు ఎన్నికల్లో 1104 యూనియన్‌కు మద్దతు ప్రకటించాలన్నారు. కార్యక్రమంలో సుగుణాకర్, శరబయ్య, వాసు, మక్తేశ్వర్‌రావు, మల్లేశం, ఆంజనేయులు, హుస్సేన్, శివయ్య, లక్ష్మయ్య, రాజమణి, సుమలత, పద్మావతి పాల్గొన్నారు.

పత్తి పంటను పరిశీలించిన ఏవో

వట్‌పల్లి: మండలంలోని గొర్రెకల్ గ్రామంలోని పత్తిపంటను మంగళవారం వ్యవసాయాధికారి మహేశ్ చౌహాన్, ఏఈవో భాగేశ్ పరిశీలించారు. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు పత్తి పంటపై ఎర్రనల్లి, సన్నదోమ వ్యాపించడంతో ఆకులు ముదురుతాయన్నారు. ఆకు ముడత నివారణకు 1919 లిక్విడ్‌ను పంటపై స్ప్రే చేయాలని రైతులకు సూచించారు. ఈకార్యక్రమంలో రైతులు తదితరులు పాల్గొన్నారు.


పత్తిపంటను పరిశీలిస్తున్న అధికారులు

31న ఎస్సీ కార్పొరేషన్ ఇంటర్వ్యూలు

వట్‌పల్లి: ఎస్సీ కార్పొరేషన్‌లో రుణాల కోసం దరఖాస్తులు చేసుకున్న వారికి ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో విద్యాసాగర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 31న ఉదయం 11 గంటలకు వట్‌పల్లిలోని మార్కెట్ యార్డు ఆవరణలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. వట్‌పల్లి, మర్వెల్లి బ్యాంక్ పరిధిలోని గ్రామాల నిరుద్యోగులు రుణాల కోసం హాజరుకావాలన్నారు. దరఖాస్తుదారులు తమ ఒర్జినల్ సర్టిఫికట్లతో హాజరుకావాలని ఎంపీడీవో పేర్కొన్నారు.

జిన్నారంలో జాతీయ క్రీడా దినోత్సవం

జిన్నారం: జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా జిన్నారంలో ఒలింపిక్ ర్యాలీ నిర్వహించారు. మంగళవారం జిన్నారంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు హెచ్‌ఎం నాగమాల, పీఈటీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో క్రీడా దినోత్సవం నిర్వహించారు. హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ జన్మదినం సందర్భంగా విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించి ఒలింపిక్ బ్యానర్‌తో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు.

కంపు కొడుతున్న కాలనీ

● పారిశుధ్యలోపంతో 12వ వార్డు ● అంతర్గత రోడ్లు లేక ప్రజల అవస్థలు ● పట్టించుకోని పాలకులు, అధికారులు

సదాశివపేట: పట్టణంలోని 12వ వార్డు పారిశుధ్య లోపంతో దర్శనమిస్తోంది. 2382 ఓటర్లు కలిగిన ఈ వార్డు పట్టణంలోని 23 వార్డుల్లో అతి పెద్ద వార్డు. రామచంద్రనగర్‌గా పిలవబడే ఈ వార్డులో కనీససౌకర్యాలు లేక ప్రజలు పడుతున్న కష్టాలు వర్ణనాతీతం. ఎన్నికల సమయంలో వార్డును అద్దంలా తీర్చిదిద్దుతామని ప్రగల్భాలు పలుకుతున్న నాయకులు తీరా ఎన్నికల్లో గెలిచాక ప్రజలకు మోహం చాటేస్తున్నారు. 20 ఏళ్లుగా ఈ కాలనీలో ప్రజల మౌలిక అవసరాలు తీర్చే నాథుడే కరువయ్యాడు. సకాలంలో అన్ని రకాల పన్నులు చెల్లిస్తున్నా సంబంధిత మున్సిపల్ అధికారులు మాత్రం కాలనీ అభివృద్ధి గూర్చి పట్టించుకున్న పాపాన పోలేదని కాలనీ వాసులు ఆరోపిస్తున్నారు. ఇక ప్రజల పక్షాన నిలబడాల్సిన ప్రజాప్రతినిధులు తమ సొంత ఎజెండాలను మాత్రమే అమలు చేసుకుంటున్నారన్న వాదనలు ఉన్నాయి.

ఎటూ చూసినా కంపే!

12వ వార్డులో ఎటూ చూసినా తీవ్ర దుర్వాసనను వెదజల్లే మురుగు నీటి గుంతలే దర్శనమిస్తాయి. కిలో మీటర్ల పొడవునా విస్తరించి ఉన్న ఈ వార్డులో అంతర్గత రోడ్లు, మురుగు కాలువల వ్యవస్థ లేకపోవడంతో ఇళ్లల్లోని మురుగు నీరు రోడ్లపైకి వచ్చి చేరుతుంది. దీంతో భూగర్భ జలాలు కలుషితమవుతున్నాయి. మురుగు నీటి గుంతల్లో ఎక్కువ కాలం నిలిచి ఉన్న నీటి కారణంగా దోమలు, ఇతర ప్రాణాంతక క్రిమి కీటకాలు వృద్ధి చెంది ప్రజలు, చిన్నారులు రకరకాల వ్యాధుల బారిన పడుతున్నారు. ఫలితంగా ఆసుపత్రుల పాలై ఆర్థికంగా చితికి పోతున్నారు. ఈ వార్డులో పలు వీధుల్లో వీధి దీపాలు కూడా లేవు. దీంతో ముఖ్యంగా రాత్రి వేళల్లో వార్డులో అంధకారం నెలకొంటుంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, పాలకులు పట్టించుకుని దశాబ్దాల కాలంగా కనీస సౌకర్యాల లేమితో తాము పడుతున్న కష్టాలను తీర్చాలని ఈ కాలనీ వాసులు కోరుతున్నారు.



12వ వార్డులో మురుగు కాలువలు లేక ఇళ్ల మధ్యనే నిలిచిన మురుగునీరు.

భూగర్భ జలాలు కలుషితమవుతున్నాయి



ఏళ్ల తరబడి కాలనీలో మురుగు కాలువలు, అంతర్గత రోడ్ల నిర్మాణం జరగక పోవడంతో ఇళ్ల ల్లోని మురుగు నీరు వీధుల్లోని రోడ్ల పైకి చేరుతోంది. దీంతో భూగర్భ జలాలు కలుషితమవుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలి

- యోగా గురువు శివకుమార్

తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది



20 ఏళ్ల క్రితం ఏర్పడ్డ రామచంద్రనగర్ కాలనీలో తాగునీటి పైప్‌లైన్ వ్యవస్థ లేకపోవడంతో మహిళలు అనేక కష్టాలు పడుతున్నారు. ప్రైవేటు వాటర్ ప్లాంట్ల నుంచి నీరు కొనుగోలు చేస్తేనే దాహార్తి తీరుతుంది. ప్రస్తుతం ప్రైవేటు వాటర్ ప్లాంట్ల నీరు కూడా కలుషితంగా లభిస్తుంది.

- గడీల ఆశిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్

పాఠశాలల్లో రుబెల్లా టీకాలు

సదాశివపేట: పట్టణంలోని కల్వర్, శాంతినికేతన్, మోనాష్టే హైస్కూల్ పాఠశాలల్లో మంగళవారం స్థానిక ప్రభుత్వాసుపత్రి వైద్యులు, సిబ్బంది మిజిల్స్ టీకాల కార్యక్రమంను చేపట్టారు. రుబెల్లా మహమ్మారిని తరిమికొట్టేందుకు తెలంగాణ సర్కారు (ప్రజారోగ్య శాఖ) ఆదేశాల మేరకు 9 నెలల పాపల నుంచి 15 ఏళ్ల వయస్సు వారికి టీకాలను వేస్తున్నట్లు వైద్యాధికారి భావనగౌడ్ తెలిపారు.

1న పూర్వ విద్యార్థుల సమావేశం

సదాశివపేట రూరల్: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సెప్టెంబర్ 1వ తేదీన పూర్వ విద్యార్థుల సమావేశం నిర్వహించడం జరుగుతుందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.పతంజలి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

'ఎస్వీ కళాశాల గుర్తింపును రద్దు చేయాలి'

సంగారెడ్డి రూరల్: తమ కళాశాలలో అధునాతన సౌకర్యాలు ఉన్నాయని తప్పుడు ప్రచారం చేసి విద్యార్థులను చేర్చుకున్న ఎస్వీ నాగార్జున, ఆదర్శ నాగార్జున జూనియర్ కళాశాల గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఎస్ఎఫ్ఐ నాయకులు సంగారెడ్డిలో డీఆర్వో రఘురాంశర్మకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు రాజ్‌కుమార్, బీరప్ప తదితరులు పాల్గొన్నారు.

'ఓడీఎఫ్‌లో జూనియర్ కళాశాలను ఏర్పాటు చేయాలి'

సంగారెడ్డి టౌన్: కంది మండలం ఓడీఎఫ్‌లో జూనియర్ కళాశాలను ఏర్పాటు చేయాలని కోరుతూ పలువురు ఓడీఎఫ్ ఉద్యోగులు ఎమ్మెల్యే చింతా ప్రభాకర్‌కు మంగళవారం సంగారెడ్డిలోని ఐబీలో వినతిపత్రం అందజేశారు. ఓడీఎఫ్‌లో ప్రభుత్వ జూనియర్ కళాశాల లేక పోవడంతో ప్రైవేట్ కార్పొరేట్ కళాశాలలను ఆశ్రయించాల్సి వస్తున్నదని, వాటిలో ఫీజులు కట్టలేక అనే మంది పేద విద్యార్థులు చదువుకోలేకపోతున్నారన్నారు.

ఘనంగా ధ్యాన్‌చంద్ జయంతి వేడుకలు

● ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రభాకర్

సంగారెడ్డి అర్బన్: జాతీయ క్రీడా దినోత్సవం, ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని మంగళవారం ఒలింపిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సంగారెడ్డిలో ర్యాలీ నిర్వహించారు. ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఒలింపిక్ అసోసియేషన్ చైర్మన్ చంద్రశేఖర్, కన్వీనర్ జావేద్ అలీ, కోకన్వీనర్ హరికిషన్, టీఎన్జీవో నేత రాజేందర్, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ మధుసూదనరెడ్డి, ఆర్.వెంకటేశ్వర్లు, బొంగులరవి, రాములు, శ్రీనివాస్, నర్సింలు, వెంకటేశం, జలేందర్‌రావు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న ఒలింపిక్ అసోసియేషన్ సభ్యులు, ఎమ్మెల్యే చింతాప్రభాకర్

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

సంగారెడ్డి టౌన్: సంగారెడ్డి, కంది మండలాలకు చెందిన ఇద్దరు పేదలకు వైద్య ఖర్చుల నిమిత్తం సీఎం సహాయ నిధి కింద విడుదలైన చెక్కులను ఎమ్మెల్యే మంగళవారం సంగారెడ్డిలోని ఐబీలో బాధితులకు అందజేశారు. సంగారెడ్డి మండలం కొత్లాపూర్‌కు చెందిన కళమ్మకు రూ.10 వేలు, కంది మండలం ఇంద్రకరణ్‌కు చెందిన స్వరూపకు రూ.29 వేలు వైద్య ఖర్చుల నిమిత్తం చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ఆర్.వెంకటేశ్వర్లు, కంది మండల పార్టీ అధ్యక్షుడు చిల్వేరి ప్రభాకర్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎంఎ సుభాన్, కౌన్సిలర్లు వెంకటేశం, ప్రదీప్‌కుమార్, టీఆర్ఎస్ నాయకులు లియాఖత్ అలీ, జలేందర్ రావు, మోహన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

డ్వాక్రా మహిళలకు వడ్డీలేని రుణాలేవి?

● రూ.1లక్ష ఇన్సూరెన్స్ కల్పించాలి ● సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు సాయిలు

సంగారెడ్డి రూరల్: టీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే డ్వాక్రా సంఘాల మహిళలకు రూ.10లక్షలు వడ్డీలేని రుణాలు ఇస్తామని చెప్పిన సర్కార్ అధికారంలోకి వచ్చి మూడేళ్లయినా వాటి ఊసేత్తడం లేదని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు సాయిలు విమర్శించారు. సంగారెడ్డిలోని కేకే భవన్‌లో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టే సంక్షేమ పథకాలు, సభలు సమావేశాలని జయప్రదం చేసేందుకు కృషి చేస్తున్న డ్వాక్రా సంఘాల మహిళలను ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. పావలా వడ్డీ రుణాలు అందిస్తామని ఇచ్చిన హామీని ఎందుకు అమలు చేయడం లేదని, 30 నెలలు నుంచి పావలా వడ్డీ బకాయిలు అందించలేదని, వాటిని వెంటనే విడుదల చేయాలన్నారు. మహిళా సంఘాలకు రూ.1లక్ష ఇన్సూరెన్స్ కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలని లేని పక్షంలో పోరాటాలకు సిద్ధమవుతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సీఐటీయూ నాయకుడు ఖాజా, సంఘం సభ్యులు సత్యమ్మ, ప్రమీల, కృష్ణవేణి, మంజుల, రాణి, సంధ్య, అనురాధ, స్వప్న పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న సాయిలు

ఘనంగా వినాయక నవరాత్రోత్సవాలు

సంగారెడ్డి రూరల్: వినాయక నవరాత్రోత్సవాల్లో భాగంగా మంగళవారం సంగారెడ్డి శివాజీనగర్‌లోని వీరహనుమాన్ మందిరంలో వినాయకుడికి భక్తులు పూజలు చేశారు. అనంతరం వినయక మండప నిర్వాహకులు భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చిందం దుర్గయ్య, రఘునందన్, కే.గోపాల్, రాజు, శివకుమార్, క్రాంతి కుమార్, శ్రావన్‌కుమార్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

గణనాథునికి ఘనమైన పూజలు



గణనాథునికి పూజలు చేస్తున్న మహిళలు

సదాశివపేట రూరల్: పట్టణంలో వాడవాడల్లో నెలకొల్పిన విఘ్నేశ్వరుడికి ప్రజలు నిత్యపూజలతో దూపదీప నైవేద్యాలు సమర్పిస్తున్నారు. శాస్త్రీరోడ్డులో శ్రీరామచంద్రయూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారీ వినాయకుడికి మంగళవారం స్థానిక మహిళలు ప్రత్యేకంగా వండిన పిండి వంటలను లంబోదరుడికి సమర్పించి భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో సునీత, పద్మావతి, మాధవి, లావణ్య, మౌనిక, రాదబాయి, సత్యలక్ష్మీ, సువర్ణ, భాగ్యశ్రీ, నవనీత, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

ఆదమరిస్తే...అంతే సంగతులు

● అరచేతిలో ప్రాణాలు పెట్టుకుని హైవేను దాటుతున్న విద్యార్థులు



ప్రమాదకరంగా జాతీయ రహదారిని దాటుతున్న విద్యార్థులు

సదాశివపేట రూరల్: మండలంలోని నందికంది గ్రామం వద్ద 65వ నెంబర్ జాతీయ రహదారి పక్కనే ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు వెళ్లేందుకు విద్యార్థులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని హైవే రోడ్డును దాటుతున్నారు. రోడ్డును దాటే సమయంలో ఏ మాత్రం ఆదమరిచినాఇరువైపులా నుంచి వేగంగా వచ్చే వాహనాల వల్ల ప్రమాదాలు జరిగే పరిస్థితి నెలకొన్నది. ఇప్పటికైనా సంబంధిత శాఖల ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకుని ప్రమాదాలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా

సంగారెడ్డి రూరల్: కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ పట్టణ అధ్యక్షుడు యాదవరెడ్డి మాట్లాడుతూ కార్మికుల బకాయి వేతనాలు చెల్లించాలని, ఈఎస్ఐ, పీఎఫ్ తదితర చట్టపరమైన సౌకర్యాలు కల్పించాలని, జీవో 14ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నర్సింహా, రాజు, దశరత్, వేణు, వెంకట్, సంజీవులు, కృష్ణ, సమీర్, పద్మ, అనిత తదితరులు పాల్గొన్నారు.

14వ రోజుకు చేరిన ఐకేపీ ఉద్యోగుల సమ్మె

సంగారెడ్డి రూరల్: తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ డీఆర్డీవోలో విధులు నిర్వహిస్తున్న సెర్ప్ (ఐకేపీ) మండల స్థాయి ఉద్యోగులు అకౌంటెంట్లు, ఆపరేటర్లు చేపట్టిన నిరవధిక సమ్మె మంగళవారం నాటికి 14వ రోజుకు చేరింది. తమ సమస్యలను పరిష్కరించే న్యాయం చేసేంతవరకు సమ్మె చేస్తామని ఉద్యోగులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జయశ్రీ, టిక్యానాయక్, రాములు, వంశీకృష్ణ పాల్గొన్నారు.

'ఖాజాపూర్‌ను పంచాయతీగా మార్చాలి'



కార్యదర్శికి వినతిపత్రాన్నిస్తున్న గ్రామస్థులు, వార్డు సభ్యులు

సిర్గాపూర్: సుల్తానాబాద్ పంచాయతీ పరిధిలోని ఖాజాపూర్‌ను గ్రామపంచాయతీగా మార్చాలని కోరుతూ ఆ గ్రామస్థులు, వార్డు సభ్యులు కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. పాలనా సౌలభ్యం కోసం జిల్లాలను, మండలాలను, తండాలను విభజించినట్లు పెద్ద గ్రామాలను విడదీసి పంచాయతీలుగా చేయాలన్నారు. ఖాజాపూర్‌ను కూడా జనాభా ప్రతిపాదికన గ్రామపంచాయతీగా గుర్తించాలని వారు కోరారు.

పాఠశాలకు 1.50లక్షల విలువైన ఫర్నిచర్ అందజేత



జడ్పీహెచ్ పాఠశాలకు ఫర్నిచర్‌ను అందజేసిన మహిపాల్‌రెడ్డి

కల్హేర్: విద్యాబుద్ధులు నేర్చుకున్న పాఠశాల రుణం తీర్చుకోవడంతో పాటు అదే పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న చిన్నారుల అవసరాలు తీర్చడానికి నారాయణఖేడ్‌లోని భారత్ గ్యాస్ డిస్ట్రిబ్యూటర్ యాజమాని, రసగీతి సాహిత్య సాంస్కృతిక వేదిక అధ్యక్షుడు మహారెడ్డిగారి మహిపాల్‌రెడ్డి రూ.1.5 లక్షల విలువచేసే ఫర్నిచర్‌ను మంగళవారం బీబీపేటలోని జడ్పీహెచ్ స్కూల్‌కు అందజేశారు. ఆయన తండ్రి నారాయణరెడ్డి జ్ఞాపకార్థం 40 డోల్ డెస్కులను ఇచ్చారు. మహిపాల్‌రెడ్డి ఔదార్యానికి విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాల సిబ్బంది కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా మహిపాల్‌రెడ్డిని ఎంఈవో శంకర్, హెచ్‌ఎంలు బాలకిష్టయ్య, రాములు, సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సంతోషమ్మ, నాయకులు గుండు మోహన్, నాగిరెడ్డి, విశ్రాంత ఉపాధ్యాయులు పోచయ్య, భూమయ్య, మాజీ సర్పంచ్ గుండు శివ్వయ్య, శంకరయ్య, సాయిలు పాల్గొన్నారు.

బంగారు తెలంగాణ సాధనే ప్రభుత్వ లక్ష్యం

- 'ఖేడ్'ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తాం
- ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి
- గ్రామాల్లో సీసీ రోడ్లకు ప్రారంభోత్సవం
- లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కుల అందజేత

కంగ్టి: పార్టీలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందజేయడంతో పాటు గ్రామాలను అభివృద్ధి చేసి బంగారు తెలంగాణను సాధించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రమైన కంగ్టితో పాటు ఆయా గ్రామాల్లో సీసీ రోడ్లను ప్రారంభించి, పలువురు లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గత పాలకుల నిర్లక్ష్యంతో వెనుకబాటుకు గురైన ఖేడ్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామన్నారు.

మరుగుదొడ్ల నిర్మాణంలో ఎఫ్ఏ అలసత్వంపై మండిపాటు

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణంలో అలసత్వం ప్రదర్శిస్తుండడంతో మండల పరిధిలోని గాజుల్‌పాడ్ ఫీల్డ్ అసిస్టెంట్‌పై ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి తీవ్రంగా మండి పడ్డారు. గ్రామానికి 237 మరుగుదొడ్లు మంజూరైతే కేవలం 42 మాత్రమే అప్‌డేట్ చేశారన్నారు. ఉద్దేశపూర్వకంగా ప్రజలకు ఇబ్బంది కలిగిస్తే ఉపేక్షించేది లేదన్నారు. ఉపాధిహామీ సిబ్బంది నిర్లక్ష్యంతో పేదలకు అన్యాయం జరుగుతుందన్నారు. పనితీరులో పద్ధతిని మార్చుకోవాలని ఎమ్మెల్యే హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రామారావు, ఎంపీడీవో రత్నమాల, తహసీల్దార్ రాజయ్య, సర్పంచులు విఠాబాయి, విఠల్ జాదవ్, జగదేవి, సరస్వతి, దత్తాత్రి, ఝురూబాయి, ఆలయ కమిటీ చైర్మన్ నాగన్నషెట్కార్, మాణిక్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, రాజుపటేల్, సిద్దు, వెంకట్‌రావు, అశోక్‌రావు, సత్యనారాయణ, సాయాగౌడ్, నాగభూషణం, డీఈఈ శ్రీనివాస్, ఏఈలు మాధవ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



గాజుల్‌పాడ్‌లో సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నిరుద్యోగులకు ఉపాధి అవకాశాల్లో ప్రాధాన్యం

- ప్రతిభావంతులకు ప్రత్యేక శిక్షణ
- ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి
- టాటా సంస్థ సహకారంతో జాబ్ మేళా

నారాయణఖేడ్: నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు తమ ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని సాయిబాబా ఫంక్షన్ హాల్‌లో మంగళవారం టాటా సంస్థ సహకారంతో ఏర్పాటు చేసిన జాబ్ మేళాను ఆయన ప్రారంభించి మాట్లాడారు. టీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చాక ప్రజా సంక్షేమం, అభివృద్ధితో పాటు వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. ప్రధానంగా విద్యాభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తునట్లు ఆయన చెప్పారు. నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే ఆలోచనతో టాటా సంస్థ వారితో మాట్లాడి జాబ్ మేళాను ఏర్పాటు చేయించామన్నారు. పదవ తరగతి నుంచి ఉన్నత విద్యనభ్యసించిన వారిలో ప్రతిభావంతులకు ప్రత్యేకంగా శిక్షణ ఇప్పించి ఉపాధి అవకాశాలు కల్పిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఖేడ్ ఇన్‌చార్జి సర్పంచ్ నజీబ్, మనూరు జడ్పీటీసీ నిరంజన్, విజిలెన్స్ కమిటీ సభ్యుడు రవీందర్‌నాయక్, మార్కెట్ కమిటీ చైర్మన్ బాసిత్, పెద్దశంకరంపేట పార్టీ అధ్యక్షుడు విజయరామరాజు, ఎస్ఐ నరేందర్, యూసుఫ్, టాటా సంస్థ బాధ్యులు సందీప్, అబ్దుల్ హమీద్ పాల్గొన్నారు. కాగా.. ఈ జాబ్ మేళాకు పెద్ద సంఖ్యలో నిరుద్యోగులు హాజరయ్యారు.





మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి, జాబ్ మేళాలో దరఖాస్తులు ఇచ్చేందుకు వచ్చిన నిరుద్యోగులు

కార్యకర్త కుటుంబానికి ఆర్థికసాయం

అనారోగ్యంతో మృతిచెందిన పెద్దశంకరంపేట మండలం మాడ్చేట్‌పల్లి గ్రామానికి చెందిన టీఆర్‌ఎస్ కార్యకర్త చంద్రయ్య భార్య శాంతమ్మకు ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి మంగళవారం రూ.2 లక్షల చెక్కును అందజేశారు. అనంతరం పట్టణానికి చెందిన సంజీవ్‌కు రూ.8 వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అందించారు.

రామక్రిష్ణ మృతికి నిరసనగా 'ఖేడ్'లో ర్యాలీ

నారాయణఖేడ్: డీఎస్సీ ప్రకటన వెలువడకపోవడంతో మనస్తాపానికి గురై నిరుద్యోగి రామక్రిష్ణ మృతిచెందడాన్ని నిరసిస్తూ మంగళవారం నారాయణఖేడ్‌లో కాంగ్రెస్ పార్టీ విద్యార్థి నిరుద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో డీఎస్సీ అభ్యర్థులు, విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో పాల్గొన్నవారు రామక్రిష్ణ 'అమర్ రహే', 'డీఎస్సీ ప్రకటన వెలువడక పోవడంతోనే రామక్రిష్ణ మృతిచెందాడంటూ' నినాదాలు చేశారు. అంతకుముందు ఎంపీపీ సంజీవరెడ్డి, రాష్ట్ర విద్యార్థి నిరుద్యోగ జేఏసీ చైర్మన్ మానవతారాయ్ తదితరులు పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రామక్రిష్ణ కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ఈ సందర్భంగా ఎంపీపీ సంజీవరెడ్డి రామక్రిష్ణ కుటుంబ సభ్యులకు తన వంతుగా రూ.10 వేల ఆర్థికసాయాన్ని అందజేశారు. రామక్రిష్ణ మృతికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని, మృతుని కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, రూ.50 లక్షల పరిహారం ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర నాయకులు మహేష్‌రాం, న్యాయవాది సంగన్న, కాంగ్రెస్ ఎస్టీసెల్ రాష్ట్ర నాయకులు భీంరావునాయక్, సీడీసీ మాజీ చైర్మన్ నర్సింహారెడ్డి, యాదవరెడ్డి, ఎంపీటీసీలు పండరిరెడ్డి, దత్తుగౌడ్, శంకర్‌ముదిరాజ్, యువజన కాంగ్రెస్ జహీరాబాద్ పార్లమెంటు నియోజకవర్గ ఉపాధ్యక్షుడు వినోద్‌పాటిల్, డీఎస్సీ అభ్యర్థుల సంఘం రాష్ట్ర కార్యదర్శి మఠం శివానంద స్వామి, విద్యార్థి నిరుద్యోగ జేఏసీ జిల్లా అధ్యక్షుడు నాయికోటి అమేర్ తదితరులు పాల్గొన్నారు.





ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్, జేఏసీ నాయకులు, రామక్రిష్ణ కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎంపీపీ సంజీవరెడ్డి, మానవతారాయ్

స్వరాష్ట్రంలోనూ నిరుద్యోగుల మరణాలు

నారాయణఖేడ్: తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకుంటే తమ ఆశలు నెరవేరుతాయని భావించిన నిరుద్యోగులకు అడియాశే ఎదురవుతుండడంతో తీవ్ర మనస్తాపంతో మరణిస్తున్నారని విద్యార్థి నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర చైర్మన్ మానవతారాయ్, ఎంపీపీ సంజీవరెడ్డి అన్నారు. మంగళవారం సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రధానంగా నిరుద్యోగులు, విద్యావంతులైన యువకులు తెలంగాణ వస్తే ఉద్యోగాలు, నిధులు, నీరు దక్కుతాయని భావించారన్నారు. టీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడున్నరేళ్లు గడిచినా డీఎస్సీని ప్రకటించడం లేదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 5లక్షల మంది డీఎస్సీ అభ్యర్థులు ప్రకటన కోసం ఎదురు చూస్తున్నారన్నారు. ప్రభుత్వం పూటకో మాట మాట్లాడుతోందన్నారు. దీంతో మనస్తాపానికి గురైన రామక్రిష్ణ భోజనం మాని అనారోగ్యానికి గురై మృతిచెందాడన్నారు. ఆయన మృతికి సీఎం కేసీఆర్, విద్యామంత్రి కడియం శ్రీహరి బాధ్యత వహించి పదవులకు రాజీనామాలు చేయాలని వారు డిమాండ్ చేశారు. సెప్టెంబరు 5న ఖేడ్ నుంచి ఓయూ వరకు చేపట్టే పాదయాత్రకు ప్రభుత్వం అనుమతి ఇవ్వాలన్నారు.

'జర్నలిస్టు బాలయ్య కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి'

నారాయణఖేడ్: గుండెపోటుతో మృతిచెందిన సిర్గాపూర్ మండల జర్నలిస్టు బాలయ్య కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ఖేడ్ జర్నలిస్టు జేఏసీ నాయకులు కోరారు. మంగళవారం బాలయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జర్నలిస్టులు మాట్లాడుతూ బాలయ్య తెలంగాణ ఉద్యమంలో జర్నలిస్టుగా సేవలు అందించాడని, ఆయన కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని వారు కోరారు. తమవంతుగా ఆ కుటుంబానికి సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు.

సీపీఎస్‌కు వ్యతిరేకంగా టీఎన్జీవోల ఆందోళన

నారాయణఖేడ్: కంట్రిబ్యూటరీ పెన్షన్‌కు వ్యతిరేకంగా మంగళవారం నారాయణఖేడ్‌లో టీఎన్‌జీవోల యూనియన్ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా టీఎన్‌జీవోల సంఘం నాయకులు చంద్రశ్రీనివాస్, తాండ్లే శ్రీనివాస్ మాట్లాడుతూ కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానంతో ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. అందువల్ల ఈ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. అందుకోసం ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. ఈనెల 31 వరకు నిరసనలు కొనసాగిస్తామని అనంతరం ఆందోళనలను ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ నారాయణ, పంచాయతీ కార్యదర్శుల సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మిస్కిన్, సంక్షేమాధికారులు బద్దిరాజు, రాజ్‌కమల్, రామప్ప, వీఆర్వోలు అంజయ్య, ఫిరోజ్, తదితరులు ఉన్నారు.

వానొస్తే వాగు దాటుడు కష్టమే

ఝరాసంగం: మండలంలోని బొప్పన్‌పల్లి-ప్యాలవరం గ్రామాల మధ్య ఉన్న వాగుపై వర్షాలు కురిస్తే రాకపోకలు పూర్తిగా నిలిచిపోతాయి. ప్యాలవరం గ్రామస్థులు ఇతర గ్రామాలకు వెళ్లాలంటే ఈ మార్గమే పెద్ద దిక్కు. మండల కేంద్రానికి చేరుకోవాలన్నా ఈ వాగు దాటి ప్రయాణం చేయాల్సిందే. వాగుపై వంతెన లేకపోవడంతో రాకపోకలు నిలిచిపోయి గ్రామస్థులు తీవ్రమైన ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. అత్యవసర పరిస్థితుల్లో ఉధృతంగా ప్రవహిస్తున్న వాగును దాటలేరు. వాగుకు అవతలి వైపు ఇరు గ్రామాలకు రైతుల వ్యవసాయ పొలాలు ఉంటాయి. వ్యవసాయ పొలాలకు వెళ్లాలంటే కూడా వాగును దాటాల్సిందే. ప్యాలవరం గ్రామం నుంచి బొప్పన్‌పల్లి మీదుగా ప్రయాణిస్తేనే వారికి బయటి ప్రపంచంతో సంబంధాలు ఏర్పడుతాయి. ఈ వాగు ప్రవహించే సమయంలో ఎక్కడివారు అక్కడే ఉండే పరిస్థితులు నెలకొన్నాయి. గత సంవత్సరం సెప్టెంబర్ మాసంలో కురిసిన భారీ వర్షాలకు ఈ వాగు రెండు రోజుల పాటు ఉధృతిగా ప్రవహించింది. అప్పట్లో



ఉధృతంగా ప్రవహిస్తున్న ప్యాలవరం వాగు

అక్కడికి అధికారులు చేరుకుని వాగు పరిస్థితిని పరిశీలించారు. వాగుపై బ్రిడ్జి నిర్మాణం కోసం ప్రతిపాదనలు కూడా పంపించారు. సంవత్సరం పూర్తవుతున్న ఇప్పటి వరకు ఎలాంటి కార్యచరణ మెదలు పెట్టలేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల వల్ల మళ్లీ ఈ వాగు ఉధృతిగా ప్రవహించడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వారు తెలిపారు. పాఠశాలకు విద్యార్థులు వెళ్లలేక ఇళ్ల వద్దనే ఉండాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. ఇప్పటికైనా ఈ వాగుపై వంతెన నిర్మించి ప్యాలవరం గ్రామస్థుల అవస్థలు తీర్చాలని పలువురు కోరుతున్నారు.

వెంటనే వంతెన నిర్మించాలి



మా గ్రామానికి సమీపంలోని వాగుపై వంతెనను నిర్మించాలి. కాంగ్రెస్ ప్రభుత్వ హయంలోనే వంతెన మంజూరైనట్లు అధికారులు తెలిపారు. కాని ఇప్పటి వరకు వంతెన నిర్మించలేదు. గత సంవత్సరం భారీ వర్షాలు కురవడంతో రెండు రోజులు గ్రామంలో నుంచి బయటకి వెళ్లలేదు. అప్పట్లో అధికారులు ఇక్కడికి వచ్చి వంతెన నిర్మాణం కోసం ప్రతిపాదనలు కూడా పంపారు. కాని ఇప్పటి వరకు వంతెన నిర్మాణం చేయడం లేదు.

-శ్రీశైలం, ప్యాలవరం

రెవెన్యూ సర్టిఫికెట్ల పంపిణీ

● 20మంది రైతులకు ప్రొసీడింగ్ పత్రాల పంపిణీ

ఝరాసంగం: మండలంలోని బర్దిపూర్ గ్రామంలో మంగళవారం రెవెన్యూ అధికారులు భూములకు సంబంధించిన ప్రొసీడింగ్ పత్రాలను రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహసీల్దార్ బలరాం మాట్లాడుతూ గ్రామాల్లో రెవెన్యూ సదస్సులను నిర్వహించి భూముల సమస్యలను పరిష్కరిస్తున్నామన్నారు. గ్రామంలో 20మంది రైతులకు ప్రొసీడింగ్ పత్రాలను అందజేయడం జరిగిందన్నారు. ఈకార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ నారాయణ, వీఆర్‌వో నర్సింలు, గ్రామస్థులున్నారు.

విద్యార్థులకు తట్టు, రుబెల్లా వ్యాక్సిన్

ఝరాసంగం: మండల కేంద్రమైన ఝరాసంగంలోని కేంద్రీయ విద్యాలయంలో మంగళవారం తట్టు, రుబెల్లా వ్యాక్సిన్లను విద్యార్థులకు వేశారు. 9నెలల నుంచి 15సంవత్సరాల పిల్లలకు తప్పనిసరిగా ఈ వ్యాక్సిన్ వేయించాలని వైద్య సిబ్బంది తెలిపారు. ఈ వ్యాక్సిన్ వేయడం వల్ల పిల్లలకు వ్యాధులు రావన్నారు. సెప్టెంబర్ 25 వరకు ఈ వ్యాక్సిన్ వేయడం జరుగుతుందన్నారు.

పాఠశాలను సందర్శించిన ఇన్‌చార్జి ఎంఈవో

ఝరాసంగం: మండలంలోని క్రిష్టాపూర్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను మంగళవారం ఇన్‌చార్జి ఎంఈవో శ్రీనివాస్ సందర్శించారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల, ఉపాధ్యాయుల హాజరు శాతాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ప్రణాళికబద్ధంగా పాఠ్యాంశాలను బోధించాలన్నారు. మెను ప్రకారం విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని అందజేయాలని ఉపాధ్యాయులకు సూచించారు.

ఉర్దూ పాఠశాలలకు కంప్యూటర్ల పంపిణీ

కోహీర్: మండలంలోని ప్రభుత్వ ఉర్దూ మీడియం పాఠశాలలకు ఎంఎస్‌డీపీ పథకం కింద పంపిణీ చేసిన కంప్యూటర్లను మంగళవారం మండల సూపరింటెండెంట్ ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అందజేశారు. 37 కంప్యూటర్లు మండలానికి రాగా మంగళవారం 20 కంప్యూటర్లను పంపిణీ చేయడం జరిగిందని ఆయన తెలిపారు. మిగిలిన పాఠశాలలకు, మైనార్టీ గురుకుల పాఠశాలలకు కంప్యూటర్లు అందజేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ అంజయ్య తదితరులు ఉన్నారు.

కేతకీ హుండీ ఆదాయం లెక్కింపు

ఝరాసంగం: మండల కేంద్రమైన ఝరాసంగంలోని శ్రీకేతకీ సంగమేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం హుండీ ఆదాయాన్ని లెక్కించారు. 28రోజుల హుండీ ఆదాయం రూ.17.96లక్షలు వచ్చినట్లు ఆలయ ఈవో మోహన్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ అసిస్టెంట్ కమిషనర్ క్రిష్ణప్రసాద్, గ్రామస్థులు, భక్తులు, ఆలయ సిబ్బంది ఉన్నారు.

ఘనంగా మల్లికార్జునస్వామి పల్లకీ సేవ

జహీరాబాద్: మొగుడంపల్లి మండలంలోని ధనసిరి గ్రామంలో మంగళవారం ఘనంగా మల్లికార్జునస్వామి పల్లకీసేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ పురవీధుల నుంచి ఊరేగింపుగా పల్లకీసేవ కొనసాగింది. అనంతరం కోలాటాలు, భజనలు, నాటకాలు వేశారు. భక్తులకు తీర్థప్రసాద వితరణ, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

నంద్యాల గెలుపుపై టీడీపీ సంబరాలు

జహీరాబాద్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నంద్యాల ఉప ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి భూమా బ్రహ్మానందరెడ్డి భారీ మెజార్టీతో గెలుపొందడం పట్ల మంగళవారం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వైనరోత్తం ఆధ్వర్యంలో పట్టణంలోని జాతీయ రహదారిపై టపాసులు పేల్చి స్వీట్లు పంచుకుని సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మసూద్‌హుస్సేన్, నర్సింలుగౌడ్, సుభాష్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, కిష్టయ్య, మాణయ్యగౌడ్, శంకరయ్య, శ్రీకాంత్, రాంచందర్, శివన్న, జగన్, ఎండీ షరీఫ్, వీరశెట్టి, మహేష్, ఉస్మాన్‌అలీ, ప్రతాప్‌రెడ్డి, పెంటన్న, గఫార్, లక్ష్మణ్, అమ్జద్‌ఖాన్, కిష్టన్న, మెరాజ్, నాగయ్య, రామన్న, చెంగల్ జైపాల్ తదితరులు పాల్గొన్నారు.

రూ.5లక్షల విలువ చేసే గుట్కాలు స్వాధీనం

జహీరాబాద్: కర్ణాటకలోని బీదర్ నుంచి హైదరాబాద్‌కు అక్రమంగా తరలిస్తున్న 5లక్షల విలువ గల లక్ష గుట్కా ప్యాకెట్లను మంగళవారం చిరాగ్‌పల్లి పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు పట్టణ సీఐ నాగరాజు తెలిపారు. బీదర్-జహీరాబాద్ మధ్యలో రోడ్డుపై తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు అక్రమంగా డీసీఎంలో తరలిస్తున్న గుట్కా ప్యాకెట్లను పట్టుకున్నారు. ఈ మేరకు గుట్కా ప్యాకెట్లతో పాటు వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు.

పేదలకు డబుల్‌బెడ్రూంలు మంజూరు చేయాలి

● టీఆర్‌సీపీ నాయకులు

జహీరాబాద్‌టౌన్: ఎన్నో ఏళ్లుగా జహీరాబాద్ పట్టణంలో అద్దె ఇళ్లలో జీవనం కొనసాగిస్తున్న పేద, మధ్య తరగతి వారికి డబుల్‌బెడ్రూం ఇళ్లు మంజూరు చేయాలని మంగళవారం టీఆర్‌సీపీ(తెలంగాణ రాష్ట్ర కమ్యూనిస్ట్ పార్టీ) నాయకులు ఆర్డీవో కార్యాలయ అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూలీ చేసుకుంటూ 20-30సంవత్సరాల నుంచి కిరాయి ఇళ్లలో బతుకుతున్న పేద ప్రజలకు డబుల్ ఇళ్లు ఎంతో అవసరమన్నారు. జహీరాబాద్ పట్టణానికి 700 డబుల్‌బెడ్రూం ఇళ్లు మంజూరు చేస్తున్న ప్రభుత్వం ప్రకటించిందని వారు పేర్కొన్నారు. అవి ఏమాత్రం సరిపోవని, 2500 ఇళ్లు మంజూరు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో



ఆర్డీవో కార్యాలయ అధికారికి వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

టీఆర్‌సీపీ నాయకులు వేణుగోపాల్, వినయ్‌కుమార్, మల్లికార్జున్, ప్రశాంత్, కలీమోద్దీన్, దేవదాస్, నర్సింలు, బేబీ, మల్లీశ్వరి, కమలమ్మ, అంబిక, నజీయాబేగం, సత్తార్, సి.అనిల్, మేఘమాల, నర్సమ్మ, శాంతమ్మ, బుజ్జమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గణేష్ నిమజ్జనం



కుప్పానగర్‌లో గణేష్ ఉత్సవాలకు హాజరైన మల్లయ్యగిరి మహరాజ్ బసవలింగయ్యస్వామి

ఝరాసంగం: మండల కేంద్రమైన ఝరాసంగం, మండల పరిధిలోని కుప్పానగర్, తదితర గ్రామాల్లో గణేష్ ఉత్సవాలు ఐదో రోజుకు చేరుకోవడంతో మంగళవారం రాత్రి నిమజ్జన కార్యక్రమాలను ఘనంగా చేపట్టారు. కుప్పానగర్ గ్రామంలో గణపతి నిమజ్జనంలో మల్లయ్యగిరి మహరాజ్ బసవలింగయ్యస్వామి హాజరై ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ప్రతిష్ఠించిన వినాయకులకు ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక పూజలను నిర్వహిస్తున్నారు.

కోహీర్‌లో....

మండల కేంద్రమైన కోహీర్‌తో పాటు మండల పరిధిలోని ఆయా గ్రామాలలో ప్రతిష్ఠించిన వినాయక విగ్రహాలకు ఐదు రోజుల పాటు పూజలు నిర్వహించారు. మంగళవారం ఆయా గ్రామాలలోని వినాయకులను భక్తిశ్రద్ధలతో పురవీధుల గుండా ఊరేగింపు నిర్వహిస్తూ భాజభజంత్రీల మధ్య ఘనంగా నిమజ్జనం చేశారు. దిగ్వాల్‌లో 12, కొత్తూర్(డి)లో 2, కోహీర్‌లో 3, మాచిరెడ్డిపల్లి, నాగిరెడ్డిపల్లి, పర్వపల్లి, వెంకటాపూర్, కవేలి, ఖానాపూర్, కొత్తూర్(కె), బిడాంపేట, పోతిరెడ్డిపల్లి, చింతల్‌ఘట్ గ్రామాల్లో ఒకటి, మనియార్‌పల్లిలో 2, మద్రిలో 2 వినాయకులను నిమజ్జనం చేశారు.

రాయికోడ్‌లో....

మండలంలోని ఆయా గ్రామాల్లో మంగళవారం వినాయక నిమజ్జనం, అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. రాయికోడ్‌లోని భూంగొండేశ్వర్, సిద్ధివినాయక ఉత్సవ కమిటీ, రాధాక్రిష్ణ మెమోరియల్ స్కూల్, కర్చల్‌లోని ఛత్రపతి యువజన సంఘం ఆధ్వర్యంలో వినాయకుడి నిమజ్జనం చేశారు. అలాగే రాయిపల్లి(సి)లో ప్రతిష్ఠించిన భూంగొండేశ్వర వినాయకుడి వద్ద అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

‘దేశాభివృద్ధిలో యువతే కీలకం’

జహీరాబాద్‌టౌన్: దేశం అభివృద్ధి చెందాలంటే యువత పాత్ర ఎంతో ఉంటుందని ఆచార్య డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చింతల హరికుమార్, గాయని మధుప్రియ అన్నారు. మంగళవారం స్థానిక ఆచార్య డిగ్రీ కళాశాలలో విద్యార్థులు స్వాగతోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత అభివృద్ధి చెందితేనే దేశం అభివృద్ధి చెందుతుందని, సమాజ సేవ కార్యక్రమాల పట్ల యువత ప్రాధాన్యత చూపాలన్నారు. జన్మనిచ్చిన తల్లిదండ్రులను, విద్యా బుద్ధులను నేర్పే గురువులను మరిచిపోరాదని, జన్మభూమిని కూడా ఎక్కడికి వెళ్లిన గుర్తుంచుకోవాలన్నారు. ఆశయాలను నెరవేర్చుకోవడానికి భవిష్యత్తును తీర్చిదిద్దుకోవడానికి ప్రణాళికతో కృషి



సాంస్కృతిక కార్యక్రమంలో నృత్యం చేస్తున్న కళాశాల విద్యార్థినులు

చేయాలన్నారు. స్వాగతోత్సవ కార్యక్రమంలో తెలంగాణ పాటలు పాడిన మధుప్రియ అందరిని ఆకట్టుకున్నారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ సురేందర్‌రెడ్డి, డైరెక్టర్లు ఎం.వెంకట్‌రాంరెడ్డి, జి.శ్రీనివాస్‌రెడ్డి, అధ్యాపక బృందం రాఘవేందర్, మదన్, ప్రవీణ్, గోపాల్, మహేష్, రాంచందర్, శ్రీనివాస్, పుండలిక్, అడివప్ప, గణేష్, నందు, మల్లేశం, నవీనా, సబిత, స్వప్న, కారుణ్య, శిరీష, జ్యోతి, విద్యార్థిని, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాటలు పాడుతున్న గాయని మధుప్రియ

కరాటేలో పతకాల వేట

- జాతీయస్థాయిలో రాణిస్తున్న దుబ్బాక జడ్పీ బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు
- ప్రోత్సాహం ఉంటే మరింత రాణింపు
- పీడీ, కరాటే శిక్షకుడి ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణ


కరాటే ప్రాక్టీస్ చేస్తున్న విద్యార్థినులు

దుబ్బాక: కరాటే అనేది ఎవరికి వారు రక్షించుకునేందుకు నేర్చుకునే యుద్ధవిద్య. ఆత్మరక్షణకు, ఆత్మవిశ్వాసానికి ఇది ఎంతో తోడ్పడుతుంది. దుబ్బాక జడ్పీ బాలికోన్నత పాఠశాల విద్యార్థినలుఉ దీనిపై ఎంతో ఆసక్తి చూపుతున్నారు. రెజియోంకి చోటోకాన్ స్పోర్ట్స్ కరాటేలో వీరు సత్తా చాటుతున్నారు. వీరిలో ఈ విద్య నైపుణ్యాన్ని పెంచేందుకు ధర్మాజీపేటకు చెందిన బురాని శ్రీకాంత్ అనే శిక్షకుడు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. అలాగే పాఠశాల పీడీ సౌందర్య విద్యార్థులకు మరింత ప్రోత్సాహం అందిస్తున్నారు. ప్రభుత్వం ఆర్ఎంఎస్ ద్వారా సహాయం అందిస్తుంది. దీంతో విద్యార్థినులు జాతీయస్థాయి కరాటేలో బంగారు పతకాలను సొంతం చేసుకుంటున్నారు. ఇటీవల సికింద్రాబాద్‌లోని బోడుప్పల్‌లో నిర్వహించిన జాతీయస్థాయి పోటీల్లో పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినులకు బంగారు పతకాలు, ముగ్గురికి వెండి పతకాలు లభించాయి. విద్యార్థినుల ప్రతిభ ప్రదర్శనకు స్థానిక ఎమ్మెల్యే సోలిపేట రామలింగారెడ్డి ప్రశంసపత్రాలను అందించారు. పాఠశాలలో సుమారు 500 మందికి పూర్తిస్థాయి శిక్షణను అందిస్తున్నారు. విద్యార్థినులు కూడా మంచి ఉత్సాహాన్ని ప్రదర్శిస్తున్నారు. ఆసక్తిగా కరాటే నేర్చుకుంటున్నారు.

ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం

జపాన్‌కు సంబంధించిన కరాటే మనదేశంలో మంచి ప్రాధాన్యం సాధించింది. కరాటే అనేది ఎలాంటి ఆయుధాలు లేకుండా ఆత్మరక్షణకు నేర్చుకునే విద్య. ప్రాశ్చాత్య దేశాల్లో ఇప్పుడు వేలాది పాఠశాలల్లో దీన్ని ప్రత్యేక పాఠ్యాంశంగా చేర్చారు. తెలంగాణ ప్రభుత్వం ఆడపిల్లల రక్షణకు కరాటే విద్యకు ప్రాముఖ్యం ఇస్తోంది. పాఠశాలల్లో ప్రత్యేక తరగతిగా అనుమతినిచ్చింది. మహిళలు తమని తాము దాడుల నుంచి రక్షించుకునేందుకు షీటీంలు కూడా కరాటేపై ప్రత్యేక తరగతుల ద్వారా శిక్షణ ఇస్తున్నారు. ఇక ఈ విద్య ద్వారా విద్యార్థుల్లో ఏకాగ్రత, ఆత్మస్థైర్యం, ఆత్మవిశ్వాసం పెరుగుతాయి. అలాగే స్వీయ నియంత్రణ, సంకల్ప బలం పెరుగుతుంది.

ప్రత్యేక దుస్తులు కరువు

ప్రభుత్వ జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థినులు పూర్తిగా పేదరికంలో మగ్గుతున్న కుటుంబాలకు చెందిన వారు. వీరిలో చాలామంది హస్టళ్లలో ఉండి చదువుతున్నారు. ప్రభుత్వం అందించే దుస్తులతోనే చదువు కొనసాగిస్తున్నవారే అధికంగా ఉన్నారు. కరాటే విద్య నేర్చుకోవడానికి ప్రత్యేక దుస్తులు ఉండాల్సిన అవసరం ఉంది. దుస్తులు లేకపోవడంతో చాలామంది విద్యార్థినులు పోటీలకు వెళ్లడం లేదు. వివిధ చోట్ల నిర్వహించే జాతీయస్థాయి పోటీలకు వెళ్లాలంటే ప్రయాణ భారం కూడా మోయాల్సి ఉంటుంది. వాటిని భరించలేక చాలామంది వెళ్లడం లేదు. దీంతో వీరి ప్రతిభ వెలుగులోకి రావడంలేదని ఉపాధ్యాయులు పేర్కొన్నారు.



కరాటే ప్రాక్టీస్ చేస్తున్న విద్యార్థినులు, పతకాలు, ప్రశంసా ప్రతాలతో విద్యార్థినులు (ఫైల్)

జాతీయస్థాయికి చేరడం హర్షణీయం



కరాటేలో బాలికలు ఉత్సాహంగా ముందుకెళ్తున్నారు. మా పాఠశాలల్లోని విద్యార్థినులు అన్ని రకాల క్రీడల్లో రాణిస్తున్నారు. కరాటేలో తమ నైపుణ్యాన్ని ప్రదర్శించి జాతీయ స్థాయిలో సత్తా చాటారు. హెచ్ఎం పుష్పవేణి, విద్యార్థినుల తల్లితండ్రుల ప్రోత్సాహం వల్లే ఇది సాధ్యమైంది. అన్ని రకాల అవాంతరాలను అధిరోహించి విద్యార్థినులు కరాటే నేర్చుకుంటున్నారు. కరాటే నేర్చుకునే విద్యార్థినులకు ప్రభుత్వం ఆర్ఎంఎస్ పథకం ద్వారా ఇచ్చే కొద్దిపాటి నిధులను సద్వినియోగం చేసుకుంటున్నాం.

- సౌందర్య, పీడీ, జడ్పీ బాలికోన్నత పాఠశాల, దుబ్బాక

ప్రోత్సాహం ఉంటే అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తారు



విద్యార్థినులు క్రమశిక్షణతో కరాటే నేర్చుకుంటున్నారు. జాతీయ స్థాయిలో ఇద్దరికీ బంగారు పథకాలు, ముగ్గురికి వెండిపథకాలు రావడం గొప్ప విషయమే. వారు నిరంతరం శ్రమించి, తరగతులకు వస్తున్నారు. వ్యక్తిగత సమస్యలను కూడా పక్కనపెట్టి కరాటే నేర్చుకుంటున్నారు. పాఠశాలలో 500 మంది కరాటేలో శిక్షణ పొందుతున్నారు. వీరిలో నైపుణ్యం ప్రదర్శిస్తున్న విద్యార్థినులు బహుమతులు గెలుచుకుంటున్నారు. వీరికి మరింత ప్రోత్సాహం లభిస్తే అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తారు. వీరిలో చాలామంది కనీసం కరాటే దుస్తులు సమకూర్చుకునే ఆర్థిక స్థోమతలేని వారు ఉన్నారు.

- బురాని శ్రీకాంత్, కరాటే శిక్షకుడు

ఆడపిల్లలకు కరాటే అవసరం



నేను పదోతరగతి చదువుతున్నా. కరాటే వల్ల నాకు చదువులో ఏకాగ్రత పెరిగింది. అలాగే ఆత్మవిశ్వాసం పెరిగింది. కరాటే ఎంతో ధైర్యాన్ని ఇస్తుంది. ఆత్మరక్షణ పొందవచ్చనే ధీమా ఉంటుంది. దీనికోసం నిరంతరం శ్రమించాను. మా నాన్న ప్రోత్సాహం, ఉపాధ్యాయుల సహకారంతో జాతీయస్థాయిలో బంగారు పథకం సాధించగలిగా. ప్రతి ఆడపిల్లకు కరాటే అవసరమనేది నా అభిప్రాయం. దీంతో జీవితంలో ఎంతటి సమస్యనైనా ఎదుర్కోగలుగుతాం.

- బడుగు దీప, విద్యార్థిని, బంగారు పతకం గ్రహీత

క్రమశిక్షణ అలవడుతుంది



కరాటేతో ప్రత్యర్థులను ఎలా ఎదుర్కోవాలో తెలుస్తుంది. మంచి ఆలోచనలు మనలో వచ్చేలా తోడ్పడుతుంంది. క్రమశిక్షణ కూడా అలవరుస్తుంది. ప్రతి విషయంలో విజయం కచ్చితంగా వస్తుందనే ధీమా మనలో కలుగుతుంది. చదువుపై శ్రద్ధ కలిగేలా చేస్తుంది. మానసికోల్లాసం కలుగుతుంది.

- శ్వేత, విద్యార్థిని, పదోతరగతి

హిందువుల ఆదిదైవం వినాయకుడు. ఆయనకు చేసే సేవ అంటే అందరికీ ఇష్టమే. నవరాత్రుల్లో మండపాన్ని చక్కగా పూలతో అలంకరించి, విగ్రహాన్ని రకరకాల పుష్పాలతో ముస్తాబు చేయడం పరిపాటి. ప్రస్తుతం పూలు దొరకడం కష్టమైంది. కానీ ముస్లిం వ్యాపారులు వీటిని దూర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. వాటిని అందమైన పూల మాలలుగా తయారుచేసి మండపాల నిర్వాహకులకు అందజేస్తున్నారు. ఇందులో ఆదాయాన్ని అస్సలు ఆశిస్తలేరు. విఘ్నేశ్వరుడిని హిందూ భక్తులు ఆరాధించేందుకు పరోక్షంగా తమవంతు సాయం చేస్తున్నారు.


భెల్ చెక్ పోస్టు వద్ద ఏర్పాటు చేసిన పూలదుకాణాలు

మతసామరస్య.. పూలమాల

- వినాయక నవరాత్రుల్లో వెల్లివిరుస్తోన్న పరమత సహనం
- హిందువుల పండుగకు ముస్లింల పూల సరఫరా
- ధర గిట్టుబాటుకాకున్నా పరోక్షంగా దేవుడికి సేవ చేస్తున్నామంటున్నా ముస్లింలు
- మండపాల నిర్వాహకులకు సాయం
- గంగా జమునా తహజీబ్‌కు నిదర్శనం

పటాన్‌చెరు, రామచంద్రాపురం: వినాయక నవరాత్రుల సందర్భంగా ఏర్పాటు చేసిన మండపాలు ఆధ్యాత్మిక శోభతో పాటు మతసామరస్యాన్ని చాటిచెబుతున్నాయి. హైదరాబాద్ దక్కన్‌లో హిందూ ముస్లిం భాయిభాయి, గంగాజమునా తహజీబ్ విధానానికి అద్దంపట్టే విధంగా మత సహనం కనిపిస్తుంది. హిందువులు ఎంతో పవిత్రంగా నిర్వహించే వినాయక నవరాత్రుల్లో భారీ విగ్రహాలకు వేసే గజమాలలు, పూలదండలు, మండపాల వద్ద నిర్వహించే పూల డెకరేషన్ల పనులన్నీ ఎక్కువగా ముస్లింలే చేస్తున్నారు. జహీరాబాద్, సంగారెడ్డి, సదాశివపేట, నారాయణ్‌ఖేడ్, పటాన్‌చెరు, రామచంద్రాపురం తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వేలాది వినాయక విగ్రహాలకు పూలు సరఫరా చేస్తున్నది ముస్లింలే కావడం విశేషం. నవరాత్రుల నిర్వాహకులతో వీరంతా ముందుగానే ఒప్పందాలు కుదుర్చుకుని నిరంతరం పూలు సరఫరా చేస్తున్నారు. ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహం సైజును బట్టి దండను తయారు చేయాల్సి ఉంటుంది. దీంతో ముస్లింలు విగ్రహాల దగ్గరకు వెళ్లి వాటి సైజ్‌లను తీసుకుని ప్రత్యేక పూల మాలలను తయారు చేస్తున్నారు. 15 నుంచి 24ఫీట్ల వరకు ఎత్తు ఉన్న భారీ విగ్రహాలకు దండలను మండపాల్లోనే ముస్లింలు తయారు చేస్తున్నారు. విగ్రహానికి ఎలాంటి అపాయం కలగకుండా నైపుణ్యంతో నిత్యం పూలదండలను మార్చాల్సి ఉంటుంది. అందుకు అనేక ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు వీరు. ఇలా పరోక్షంగా వినాయక మండపాల్లో మతసామరస్యం ప్రబలుతోంది. చిన్నవిగ్రహాల నిర్వాహకులు నిత్యం ముస్లింల దుకాణాల వద్దకే వెళ్లి కొనుగోలు చేస్తున్నారు. ఇక పూల ధరలు చుక్కలనంటాయి. స్థానికంగా పెద్ద ఎత్తున పూలు లభించక పోవడంతో బెంగళూరు, రాజమండ్రి నుంచి వ్యాపారులు దిగుమతి చేసుకుంటున్నారు. ఒక కిలో పూలకు రూ. 200 నుంచి రూ. 300 దాకా వ్యాపారులు వెచ్చించాల్సి వస్తోంది. అయినా దండలను మాత్రం నిర్వాహకులు అడిగిన రేట్లకే తయారు చేస్తున్నారు. ఇందులో గిట్టుబాటు కాకున్నా భగవంతుడికి పరోక్షంగా సేవ చేస్తున్నామన్న భావన ముస్లింల్లో వ్యక్తమవుతోంది.


పటాన్‌చెరు గౌతంనగర్‌లో వినాయకుడికి అలంకరించిన పూలమాల



అశోక్‌నగర్‌లో ఏర్పాటు చేసిన భారీ వినాయక మండపంలో పూల డెకరేషన్

పరోక్షంగా భగవంతుడికి సేవ



వినాయక నవరాత్రుల్లో సహజంగానే పూలు, దండల గిరాకీ పెద్ద ఎత్తున ఉంటుంది. ఈ సంవత్సరం పూల ధరలు భారీగా పెరగడంతో పెద్దగా గిట్టుబాటు కావడం లేదు. ఎక్కువగా గుడిమల్కాపూర్, ఇంద్రారెడ్డిపూలమార్కెట్, రైతుబజార్ల నుంచి పూలు కొనుగోలు చేస్తున్నాం. పెరిగిన పూల ధరలకు అనుగుణంగా దండల రేట్లు పెంచితే కొనుగోలుదారులు ఇబ్బందులు పడుతున్నారు. అందువల్ల లాభం లేకుండానే అమ్ముతున్నాం. భగవంతుడి సేవలో పరోక్షంగా మేము కూడా పాలుపంచుకుంటున్నామన్న సంతృప్తి కలుగుతోంది.

- మహ్మద్ అక్బర్ బాషా, పూలవ్యాపారి, లింగంపల్లి

గిట్టుబాటు కాకున్నా.. నవరాత్రుల్లో ఇబ్బందులు తలెత్తకుండా చేస్తున్నాం

ముందస్తు ఆర్డర్లు తీసుకుని నిత్యం వినాయకులకు రకరకాల పూల దండలను, గజమాలలను జిల్లా వ్యాప్తంగా సరఫరా చేస్తున్నాం. 25ఏళ్లుగా పూలవ్యాపారం నిర్వహిస్తున్నాం. పూలధర విపరీతంగా పెరగడంతో పెద్దగా గిట్టుబాటు కావడం లేదు. అయితే నవరాత్రులకు ఇబ్బందులు ఏర్పడవద్దన్న భావన మాలో ఉంది. గిరాకీ మాత్రం పెద్ద ఎత్తున ఉంది. సరిపడ పూలు మన వద్ద పండకపోవడంతో ఇబ్బందులుపడుతున్నాం. దీనికి తోడు వర్షాల వల్ల తెచ్చిన పూలు వెంటనే వాడిపోతున్నాయి.



- ఎండీ సాహెబ్, పూల వ్యాపారి, సంగారెడ్డి

పిడుగుల కాలం.. జాగ్రత్తగా అడుగు వేద్దాం

- వర్షాకాలంలో పొంచి ఉన్న ప్రమాదం
- సూచనలు పాటిస్తే ప్రమాదం బారి నుంచి తప్పించుకోవచ్చు



కంది : వర్షాకాలం వచ్చిందంటే ఒక పక్క సంతోషం మరో పక్క భయం. వానలు వ్యవసాయానికి ఎంతో మేలు చేస్తాయి. అదే వానల వల్ల భూమ్మీద పడే పిడుగులు రైతులల్లో భయాన్ని కలిగిస్తున్నాయి. ప్రతిసారి వర్షాకాలంలో పిడుగు పాటుతో అనేక మంది ప్రాణాలు కోల్పోతునే ఉంటారు. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ పనులకు వెళ్లే వారు, పశువులను మేతకు తీసుకెళ్లే వారు పిడుగు పాటుతో ఎక్కువగా మృత్యువాత పడుతున్నారు. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడుతున్నప్పుడు కనీస జాగ్రత్తలు తీసుకుంటే ప్రాణాలను కాపాడుకోవచ్చు. అసలు పిడుగు అంటే ఏమిటి? అదేలాపడుతుంది ఎక్కెడెక్కడ పడే అవకాశాలున్నాయనే విషయాలను తెలుసుకుని అప్రమత్తంగా ఉంటే దాని బారి నుంచి బయటపడే ఆస్కారం ఉంది.

మనుషులపై పడడానికి కారణం ఇదే

అత్యధిక విద్యుత్ కలిగిన పిడుగు మనషుల మీద పడితే వెంటనే ప్రాణాలు పోతాయి. పశువులు మృత్యువాత పడతాయి. చెట్లు కాలిపోతాయి, భవనాలు బీటలు వారి ఆ శబ్దానికి కిటికీల అద్దాలు పగులుతాయి. మానవ శరీరం నుంచి విద్యుత్ ప్రవహిస్తుంది. అందుకే పిడుగు పడే అవకాశం గల పొలాలు, మైదానం వంటి ప్రాంతాల్లో మనిషి ఉంటే అక్కడి మేఘానికి భూమిని చేరడానికి దగ్గర దారి అవటం వల్ల మనిషిపై పిడుగు పడుతుంది.

భూమి మీదే ఎందుకు పడాలి?

మేఘాల్లో ఉత్పత్తి అయిన విద్యుత్ ధనావేశ స్వభావం కలిగి ఉంటుంది. ఈ ఆవేశం కొల్పోయి తటస్థం అయ్యేందుకు సదరు మేఘం అంతే స్థాయిలో గల రుణావేశం కోసం చూస్తుంది. సమాన ధన, రుణ ఆవేశాలు కలిస్తే మేఘం తన ఆవేశాన్ని కొల్పోయి శాంతిస్తుంది. కాగా, ఆకాశంలో ధనావేశానికి మేఘానికి రుణావేశం దొరకదు. అందుకే భూమిని చేరడానికి ప్రయత్నిస్తుంది. అందుకే ఆవేశిత మేఘం తనున్న ప్రాంతంలో భూమిపై ఎత్తయిన ప్రదేశం ద్వారా భూమిని చేరడానికి ప్రయత్నిస్తుంది. ఇందుకోసం మేఘం తనున్న కింది ప్రాంతంలో ఎత్తుగా ఉన్న ప్రదేశాలు చెట్లు, టవర్లు, ఎత్తయిన భవనాలపై రుణావేశాన్ని ప్రేరేపించి తద్వారా భూమి చేరుతుంది. అయితే గాలిలో విద్యుత్ ప్రవహించదు. మేఘం ఆకాశం నుంచి అత్యధిక శక్తితో గాలితో స్వల్ప కాలం శూన్యాన్ని సృష్టించి భూమిని చేరుతుంది. ఈ సందర్భంలో గాలిలో తీవ్రమైన శబ్ద తరంగాలు ఉత్పన్నమై పెద్ద శబ్దాన్ని సృష్టిస్తుంది.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- పిడుగు సహజంగా ఎత్తైన ప్రదేశాలు తాటి, ఇతర ఎత్తైన చెట్లు, టవర్లు, పెద్ద భవంతులపై పడే అవకాశం ఉంది.
- వర్షం పడుతున్న సమయంలో తప్పనిసరి చెట్టు కిందకి వెళ్లాల్సి వస్తే పెద్ద చెట్టుకి కాస్తంత దూరంలో ఉన్న చిన్న చెట్టు కిందికి వెళ్లాలి.
- పిడుగు పడుతుందని అనుమానించిన సందర్భంలో పశువుల మంద సమీపంలో ఉండకూడదు. గొర్రెలు, బర్రెలు ఇతరత్రా పశువుల మందంపై పిడుగు పడే అవకాశం ఎక్కువగా ఉంటుంది.
- పొలాల్లో పని చేస్తున్నప్పుడు ఆ ప్రదేశంలో అదేపనిగా ఆకాశంలో మెరుస్తున్నప్పుడు వెంటనే అక్కడి నుంచి కొంచెం దూరం నడుచుకుంటూ వెళ్లాలి. మెరుపు తీవ్రత ఎక్కువై వెంటనే పిడుగుపడే అవకాశముంటే మనుషుల శరీరంపై రోమాలు నిక్కబొడుచుకుంటాయి. ఆ సమయంలో వెంటనే అప్రమత్తమై పొలాల్లో ఒడ్డును అనుకుని నేలపై పడుకోవాలి.
- వర్షం పడుతున్న సమయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ కొండ చరియల ప్రాంతాల్లో ఉండకూడదు.
- మనుషులకు సమీపంలో పడినప్పుడు మిరమిట్లు గొలిపే కాంతికి చెవులు చిల్లులు పడే శబ్దానికి మూర్ఛపోయే ప్రమాదం ఉంటుంది. అలాంటి వారికి శ్వాస ఆడేలా చేయాలి. చిన్న చిన్న జాగ్రత్తలతో ప్రాణాలు కాపాడుకోవచ్చు.
- ఇంట్లో ఉన్నప్పుడు వర్షం పడితే తలుపులు, కిటికీలు మూసి ఉంచాలి. టీవీ, సెల్‌ఫోన్లు, ఫ్యాన్లు, ఫ్రిజ్‌లు లాంటి విద్యుత్ ఉపకరణాలను వాడకూడదు.
- ఇంటికి విద్యుత్ సరఫరా జరిగే మెయిన్ స్విచ్ ఆఫ్ చేసి ఉంచితే మరీ మంచిది. పిడుగుల సమయంలో ఇనుము, రాగి వస్తువులను దగ్గర ఉంచకూడదు. వాటికి పిడుగులకు ఆకట్టుకునే శక్తి ఎక్కువగా ఉంటుంది.

పిడుగు అంటే..

వివిధ కారణాలతో మేఘాల్లో ఉత్పత్తి అయిన విద్యుత్ భూమికి చేరడాన్నే పిడుగు అని అంటారు. నాలుగు నుంచి ఆరు కిలోమీటర్ల ఎత్తు నుంచి పిడుగులు పడుతుంటాయి. కొన్ని మిలియన్ ఓల్టుల పొటెన్షియల్, 10వేల ఆంపియర్ల విద్యుత్ ప్రవాహంతో సుమారు 35 వేల డిగ్రీల ఉష్ణోగ్రతతో కొన్ని సెకన్ల కాలంలో పిడుగు భూమిని చేరుతుంది. ఇంతటి తీవ్రత కలిగిన పిడుగు మనుషులపై, పశువులపై, చెట్లపై పడినప్పుడు మండిపోవడం మనం చూస్తూనే ఉన్నాం. పిడుగు పడుతున్నప్పుడు మెరుపు, శబ్ధం ఒకే సారి ఉత్పత్తవుతుంది. మెరుపు మన కళ్లకు వెంటనే చక్‌మనిపించినా మన నుంచి పిడుగు ఉత్పత్తి స్థానాన్ని బట్టి 4నుంచి 8సెకండ్ల కాలంలో తీవ్రమైన శబ్దం వినిపిస్తుంది. మెరుపు ఒక పెద్ద తీగకు రెమ్మల కనిపించినా ప్రధానంగా భూమిని చేరే పిడుగు మాత్రం రెండు లేదా మూడు ఇంచుల వ్యాసంతో ఉంటుంది. పిడుగు సెకన్‌కు 3లక్షల కిలో మీటర్లు ప్రయాణిస్తే, దాని ధ్వని సెకండ్‌కు 340 మీటర్లు మాత్రమే ప్రయాణిస్తుంది. మెరుపు (కాంతి) మెరిసిన కొద్దిసేపటికీ ఉరుము వినిపిస్తుంది. కానీ చాలా మందికి ఈ విషయం తెలియక ఉరుము వినపడినప్పుడే పిడుగు పడిందని భయపడుతుంటారు. నిజానికి అది కొన్ని సెకన్ల క్రితం పడిన పిడుగు శబ్దమే.

'భిన్న పరీక్ష' నుంచి కచ్చితంగా ప్రశ్నలు

భిన్న పరీక్ష

ప్రస్తుత పోటీ పరీక్షల్లో భిన్న పరీక్ష విభాగానికి సంబంధించిన ప్రశ్నలు రెండు లేదా మూడు తప్పనిసరిగా ఉంటున్నాయి. ఎస్‌ఐ తదితర పరీక్షల్లో ఈ విభాగం నుంచి 8 లేదా 10 ప్రశ్నలు కచ్చితంగా వస్తున్నాయి. కాబట్టి రీజనింగ్‌లో ఈ టాపిక్ చాలా ముఖ్యమైంది.
ఈ టాపిక్‌కు సంబంధించిన ప్రశ్నల్లో నాలుగు లేదా ఐదు పదాలు/ పదాల జతలు / సంఖ్యలు/ వర్ణమాల అక్షరాల సమూహాలను ఇస్తారు. ప్రశ్న & సమాధానాలుగా ఇచ్చే ఎ, బి, సి, డిల్లో ఒకటి మినహా మిగిలినవన్నీ ఒకే లక్షణంతో ఉంటాయి. ఆ విధంగా భిన్నంగా ఉండే పదం/ పదాల జత/ సంఖ్య/ వర్ణమాల అక్షరాల సమూహాన్ని సమాధానంగా గుర్తించాలి. అంటే ఇచ్చిన ఎ, బి, సి, డిల్లో భిన్నంగా ఉన్న దానిని తొలగించాలి.
ఈ విభాగంలో మూడు మోడల్స్ ఉన్నాయి. అవి..
1. పదాలతో భిన్న పరీక్ష
2. భిన్నమైన సంఖ్యను కనుక్కోవడం
3. భిన్నమైన వర్ణమాల అక్షరాల సమూహాన్ని గుర్తించడం

మోడల్ - 1
పదాలతో భిన్న పరీక్ష

ఇందులో రెండు రకాలు ఉన్నాయి. అవి..
టైప్ 1: నాలుగు పదాలు ఇచ్చి భిన్నమైన దానిని సమాధానంగా గుర్తించమని అడుగుతారు.
టైప్ 2: నాలుగు పదాల జతలను ఇచ్చి భిన్నమైన జతను సమాధానంగా గుర్తించమని అడుగుతారు.

టైప్ 1

1. ఎ) భరతనాట్యం బి) కూచిపూడి
సి) భాంగ్రా డి) యక్షగానం
సమాధానం: **సి**
వివరణ: భాంగ్రా మినహా మిగిలినవన్నీ శాస్త్రీయ నృత్యాలు. భాంగ్రా జానపద నృత్యం.

2. ఎ) అక్టోబరు బి) నవంబరు
సి) డిసెంబరు డి) జనవరి
సమాధానం: **బి**
వివరణ: నవంబరు మినహా మిగిలిన నెలలకు నెలకు రోజులు 31. కానీ, నవంబరు నెలలో 30 రోజులు మాత్రమే ఉంటాయి.

3. ఎ) ముఖ్యమంత్రి బి) లోక్‌సభ సభ్యుడు
సి) రాజ్యసభ సభ్యుడు డి) ప్రధానమంత్రి
సమాధానం: **ఎ**
వివరణ: ముఖ్యమంత్రి మినహా మిగిలిన వ్యక్తులు కేంద్ర ప్రభుత్వానికి చెందిన వారు.

4. ఎ) కోహిమా బి) ఇంఫాల్ సి) అగర్తల డి) పట్నా
సమాధానం: **డి**
వివరణ: పట్నా మినహా మిగిలినవన్నీ వివిధ ఈశాన్య రాష్ట్రాల రాజధానులు

5. ఎ) పెల్లాగ్రా బి) బెరిబెరి సి) ఎనీమియా డి) గాయిటర్
సమాధానం: **డి**
వివరణ: గాయిటర్ మినహా మిగిలనవన్నీ విటమిన్ లోపంతో వస్తాయి. కానీ, గాయిటర్ వ్యాధి మాత్రం అయోడిన్ లోపంతో వస్తుంది.

6. ఎ) బ్యాడ్మింటన్ బి) చెస్ సి) క్యారమ్స్ డి) బిలియర్డ్స్
సమాధానం: **ఎ**
వివరణ: బ్యాడ్మింటన్ తప్ప మిగిలినవి ఇండోర్ గేమ్స్

7. ఎ) మే బి) జూన్ సి) జూలై డి) ఆగస్టు
సమాధానం: **బి**
వివరణ: జూన్ మినహా మిగిలిన అన్ని నెలలకు నెలకు 31 రోజులు ఉంటాయి.

8. ఎ) నైల్ బి) ఓల్గా సి) నయాగరా డి) అమెజాన్
సమాధానం: **సి**
వివరణ: నయాగరా మినహా మిగిలినవన్నీ నదుల పేర్లు. నయాగరా అనేది జలపాతం.

9. ఎ) గుండె బి) నేత్రం సి) చెవి డి) కాలు
సమాధానం: **ఎ**
వివరణ: గుండె తప్ప మిగిలినవి జతగా ఉంటాయి.

10. ఎ) నియాసిన్ బి) ట్రిప్సిన్
సి) థయామిన్ డి) రైబోఫ్లోవిన్
సమాధానం: **ఎ**



Panditi Meenakshi Pavan
Senior Faculty

Competitive Exams Special

వివరణ: ట్రిప్సిన్ మినహా మిగిలినవన్నీ విటమిన్ పేర్లు. ట్రిప్సిన్ అనేది ఎంజైమ్.

11. ఎ) బంతి బి) చేమంతి సి) తామర డి) గులాబి
సమాధానం: **సి**
వివరణ: తామర మినహా మిగిలిన పువ్వులన్నీ భూమి మీద పెరుగుతాయి. తామర నీటిలో పెరుగుతుంది.

12. ఎ) పోలెండ్ బి) గ్రీస్ సి) స్పెయిన్ డి) కొరియా
సమాధానం: **డి**
వివరణ: కొరియా మినహా మిగిలిన దేశాలు యూరప్ ఖండంలోనివి. కానీ, కొరియా ఆసియా ఖండానికి సంబంధించిన దేశం.

13. ఎ) చెన్నై బి) హైదరాబాద్ సి) బెంగళూరు డి) లక్నో
సమాధానం: **డి**
వివరణ: లక్నో మినహా మిగిలినవన్నీ వివిధ దక్షిణ భారత రాష్ట్రాల రాజధానులు. లక్నో మాత్రం ఉత్తర భారతంలోని రాష్ట్రానికి సంబంధించిన రాజధాని.

14. ఎ) కివి బి) గద్ద సి) పెంగ్విన్ డి) ఆస్ట్రిచ్
సమాధానం: **బి**
వివరణ: గద్ద మినహా మిగిలిన పక్షులు ఎగరలేనివి. గద్ద ఎగిరే పక్షి.

15. ఎ) గోధుమ బి) ఆవాలు సి) వేరుశనగ డి) వరి
సమాధానం: **డి**
వివరణ: వరి మినహా మిగిలినవన్నీ రబీ పంటలు. వరి ఖరీఫ్ పంట

16. ఎ) బైకాల్ బి) ఢాల్ సి) చిలక డి) థార్
సమాధానం: **డి**
వివరణ: థార్ మినహా మిగిలినవన్నీ వివిధ సరస్సుల పేర్లు. థార్ అనేది ఎడారి.

17. ఎ) కోణార్క్ బి) మధురై సి) ఎల్లోరా డి) దిల్వారా
సమాధానం: **సి**
వివరణ: ఎల్లోరా మినహా మిగిలివన్నీ ప్రసిద్ధ దేవాలయాలు ఉన్న ప్రదేశాలు. ఎల్లోరా ప్రసిద్ధ గుహలు ఉన్న ప్రదేశం

18. ఎ) రుగ్వేదం బి) ఆయుర్వేదం
సి) సామవేదం డి) యజుర్వేదం
సమాధానం: **బి**
వివరణ: ఆయుర్వేదం మినహా మిగిలినవి వేదాలు. అయుర్వేదం అనేది వైద్య శాస్త్రం.

